E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 07-02-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక: 37 || పేజీలు–6 www.ekaburu.com




వరల్డ్ ఛాంపియన్స్‌గా భారత్ » 6లో


2

## ట్రంప్ నోబెల్ పాట్లు
## మిత్రదేశం చీవాట్లు

ఈ కబురు: అమెరికాకు మరో మిత్ర దేశం షాకిచ్చింది. అగ్రరాజ్య సూచనలను పట్టించుకోలేదు సరికదా.. తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదంటూ చురకలంటించింది.


6

## దమ్మున్నోడు
## వైభవ్‌సూర్య వంశీ వీర విహారం

14 ఏళ్ల 316 రోజులు.. శుక్రవారం నాటికి వైభవ్ సూర్యవంశీ వయసు. సాధారణంగా ఈ వయసున్న పిల్లాడు ఆటలన్నీ కట్టిపెట్టి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతూ ఉండాలి.


2

## పాక్‌లో మారణహోమం

- ఇస్లామాబాద్‌లో మసీదు వద్ద ఆత్మాహుతి దాడి
- 31 మంది దుర్మరణం

ఈ కబురు, నెట్‌వర్క్ : పాకిస్థాన్ మరోసారి రక్తసిక్తమైంది. ఆ దేశ రాజధాని ఇస్లామాబాద్‌లో ఓ మసీదు లక్ష్యంగా శుక్రవారం ఆత్మాహుతి దాడి చోటుచేసుకుంది. ఈ ఘటనలో 31 మంది మృత్యువాతపడ్డారు.



## గోదావరి జలాలను అడ్డుపెట్టుకుని..
# తెలంగాణను కొల్లగొట్టారు


- రూ.లక్ష కోట్లు తిన్న కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడుతున్నదెవరు?
- కేసీఆర్‌కు దత్తపుత్రుడిలా కిషన్‌రెడ్డి వ్యవహారశైలి
- భారాస, భాజపా ఒకటే.. వారికి ఓటేస్తే మూసీలో కలిసినట్లే..
- 70 వేల ఉద్యోగాలిచ్చాం.. లెక్క పెట్టుకోండి..
- ఇందులో ఒక్క తల తగ్గినా నా తల తీసుకుంటా..
- సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

**ఈ కబురు, నిజామాబాద్:**

గోదావరి జలాలను అడ్డం పెట్టుకుని అప్పటి భారాస పాలకులు తెలంగాణను కొల్లగొట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విరుచుకుపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.లక్ష కోట్లు దిగమింగిన కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడుతున్నదెవరు' అంటూ భాజపా నేతలను ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దీపూర్ శివారులో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాపాలనప్రగతిబాట' బహిరంగ సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. "భారాస హయాంలో కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చారని ప్రధాని మోదీ, అమిత్‌షా అప్పట్లో ఆరోపించారు. తమకు అవకాశమిస్తే 48 గంటల్లో కేసీఆర్, హరీశ్‌లను జైల్లో పెడతామని చెప్పారు. మేం శాసనసభలో చర్చించి.. ఆరు నెలల కిందటే కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి ఇచ్చాం. 48 గంటల్లో బాధ్యులను జైల్లో పెడతానన్న కిషన్‌రెడ్డి ఎక్కడ దాక్కున్నారు? ఫార్ములా ఈ కేసును కేంద్రానికి పంపిస్తే మోదీ కార్యాలయంలో మూలన పడేశారు. భారాస నాయకులను కాపాడుతున్నదెవరో నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు కనిపించడం లేదా? తెలంగాణ నుంచి 8 మంది భాజపా ఎంపీలను గెలిపిస్తే మోదీ నిధులు ఇవ్వరా? కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కేంద్ర మంత్రులుగా చేశారు కానీ.. హైదరాబాద్ మెట్రో విస్తరణకు, మూసీ ప్రక్షాళనకు, రీజినల్ రింగ్‌రోడ్డుకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. భారాస, భాజపాలది విడదీయరాని బంధం. వీళ్లలో ఎవరు గెలిచినా ఒకటే. వారికి ఓట్లు వేస్తే మూసీలో కలిసినట్లే. తరువాయి 2లో

# 6 గ్యారంటీల్లో
## ఒక్కటైనా అమలు చేశారా?

- కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం నేర్పాలి
- ఎన్నికల ప్రచారంలో కేటీఆర్



**ఈకబురు, హైదరాబాద్-**

: అడ్డగోలు హామీలిచ్చి గద్దెనెక్కిన తరువాత కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కదాన్నైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్, అమరవీరుల స్థూపం, తెలంగాణ కూడలి వద్ద కార్నర్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గతంలో ఎన్నికల సందర్భంగా రాసిచ్చిన ఆరు గ్యారంటీల బాండ్ పేపరును కేటీఆర్ చదివి మాట్లాడారు. 'ఈసారి తనకు ఓటు వేయకుంటే చనిపోతానని.. నాలుగుసార్లు ఓడిపోయానని సానుభూతి డైలాగులు కొట్టి ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తరువాత హామీలను మరిచిపోయారు. పదేళ్ల భారాస పాలనలో వేములవాడ పట్టణంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. రెండున్నరేళ్లలో ఆది శ్రీనివాస్ వేములవాడకు ఏం చేశారో చెప్పాలి. కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పితే తప్ప గ్యారంటీలు అమలు కావు. పేదల ఖాతాలో ప్రధాని మోదీ రూ.15 లక్షలు వేస్తానన్నారు. ఎవరికైనా వేశారా? భాజపా ప్రతి ఎన్నికలోనూ కులం, మతం, దేవుడి పేరుతో ఓట్లు వేయించుకొని ప్రజలను మోసం చేస్తోంది. తరువాయి 2లో

## 14%ముస్లిం రిజర్వేషన్లకు
# రేవంత్‌రెడ్డి యత్నం

- బీసీలు ఓట్లతోనే కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**ఈ కబురు, హైదరాబాద్**

: ముస్లింలకు మొత్తంగా 14 శాతం రిజర్వేషన్లను కల్పించి అసలైన బీసీలకు అన్యాయం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. తరువాయి 2లో

## ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని
# మహిళను ఒత్తిడి చేయలేం: సుప్రీంకోర్టు



ఈ కబురు: అవాంఛిత గర్భధారణకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని ఏ మహిళను ఒత్తిడి చేయలేమని స్పష్టం చేసింది. మైనర్‌గా ఉన్నప్పుడు గర్భవతి అయిన ఓ అమ్మాయి 30 వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించేందుకు అనుమతినిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆమె కేసులో గర్భవిచ్ఛిత్తికి నిరాకరిస్తూ బాంబే హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలను సుప్రీం ధర్మాసనం తాజాగా పక్కనపెట్టింది. తరువాయి 2లో

# భారీ ఎన్‌కౌంటర్

- ఏడుగురు మావోయిస్టులు, ఓ కమాండో కానిస్టేబుల్ మృతి
- మృతుల్లో మావోయిస్టు పార్టీ వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో కార్యదర్శి పద్కల్ స్వామి

ఈ కబురు, హైదరాబాద్ : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపుర్‌మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాల సరిహద్దు గడ్చిరోలిలోని అబూజ్‌మడ్ అడవుల్లో గురువారం నుంచి జరిగిన భారీ ఎన్‌కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో కార్యదర్శిగా ఉన్న లోకేటి చందర్‌రావు ఎలియాస్ ప్రభాకర్ ఎలియాస్ పద్కల్ స్వామి(57) ఉన్నాడు. ఈ ఘటనలో సీ60 కమాండో కానిస్టేబుల్ దీపక్ చిన్న మదవి మంద్రా (38) ప్రాణాలు కోల్పోయారు. ఘటన స్థలంలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో రూ.25 లక్షల రివార్డు ఉన్న ప్రభాకర్‌తోపాటు అనిల్ కొవాచి, కామేశ్ పదం, భజ్నాథ్‌లను గుర్తించారు. మరో ముగ్గురిని గుర్తించే ప్రక్రియ జరుగుతోంది.




**––ముగిసిన పద్కల్ స్వామి శకం**

ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టు పార్టీలో పద్కల్ స్వామి శకం ముగిసింది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ఇస్రోజివాడికి చెందిన పద్కల్ స్వామి 7వ తరగతి వరకు చదివి 1995లో పీపుల్స్‌వార్ (ప్రస్తుత మావోయిస్టు)లో చేరారు. భార్య సులోచన ఎలియాస్ నవనీత, కుమారుడు రమేశ్, కుమార్తె లావణ్య సైతం మావోయిస్టుల్లో చేరడంతో పార్టీలో అరుదైన కుటుంబంగా ముద్రపడింది. 2016లో సులోచన అనారోగ్యంతో పార్టీలోనే చనిపోయారు. రమేశ్ ఉద్యమంలోనే గొట్ట బుజ్జి ఎలియాస్ కమలను వివాహం చేసుకోగా ఆమె అరెస్టయింది. లావణ్యనూ పోలీసులు అరెస్ట్ చేశారు. రమేశ్ 2నెలల క్రితం జనగామ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆ సమయంలో అజ్ఞాతం వీడేందుకు ససేమిరా అన్న స్వామి తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. తరువాయి 2లో

# మార్కులపై
# వ్యామోహం వద్దు

- జీవన నైపుణ్యాలపై శ్రద్ధ పెట్టండి
- విద్యను భారంగా పరిగణించొద్దు
- నచ్చిన రంగంలో దూసుకెళ్లండి
- 'పరీక్షా పే చర్చ'లో విద్యార్థులకు ప్రధాని మోదీ దిశానిర్దేశం



**ఈ కబురు, దిల్లీ:**

పరీక్షలు పండగల్లాంటివని, వాటిని ఓ వేడుకగా జరుపుకోవాలని విద్యార్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. మార్కులపై వ్యామోహం వీడి జీవన నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంపై శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. "విద్యను భారంగా చూడకండి. గతేడాది ప్రథమస్థానం వచ్చిన విద్యార్థి పేరు ఇప్పుడు ఎవరికీ గుర్తుండదు. మార్కులకు అంతగా ప్రాధాన్యం లేదని దీన్ని బట్టే అవగతమవుతోంది. జీవితాన్ని మెరుగుపరచుకోవడానికి విద్య ఓ మార్గం మాత్రమే. పరీక్షల కోసమే మన జీవితం లేదు. తుది లక్ష్యం.. మార్కులు కారాదు. సంపూర్ణ జీవన వికాసమే కీలకం. విద్యతో పాటు జీవితాన్ని తీర్చిదిద్దుకోవడంపైనా దృష్టి పెట్టండి. సాధించగల లక్ష్యాన్నే ఎంపిక చేసుకోండి. అలా అని సులభమైన లక్ష్యాన్ని ఎంచుకోవద్దు. నచ్చిన రంగంలో దూసుకెళ్లండి" అని దిశా నిర్దేశం చేశారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, వివిధ రాష్ట్రాల బోర్డు పరీక్షల తేదీలు సమీపించిన వేళ శుక్రవారం తన అధికారిక నివాసంలో వార్షిక 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని ప్రధాని మోదీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల విద్యార్థులతో సంభాషించారు.

**నాకూ సలహాలిస్తుంటారు**

"నేను అంచెలంచెలుగా ప్రధాని స్థాయికి ఎదిగాను. ఇప్పుడు కూడా చాలామంది నాకు సూచనలిస్తూ ఉంటారు. నా పని విధానంలో కొన్ని మార్పులు చేసుకోవాలని సలహాలు ఇస్తుంటారు...... (మిగతా 2లో)



## అడవి లేదు..
## ఆకలి తీరట్లేదు

- ఆందోళనతో అటూఇటూ తిరుగుతున్న పెద్దపులి
- జనగామ, యాదాద్రి జిల్లాల్లో 50 ఏళ్ల తర్వాత సంచారం

**ఈ కబురు, హైదరాబాద్ :**

మహారాష్ట్ర నుంచి తెలంగాణలో అడుగు పెట్టిన పెద్దపులి.. సుమారు 250 కి.మీ.లు ప్రయాణించింది. దట్టమైన అడవి కోసం అన్వేషిస్తోంది. ఎక్కడ ఆవాసం ఏర్పరచు కోవాలో, ఏం తినాలో అర్థం కాని పరిస్థితుల్లో ప్రస్తుతం జనగామ, యాదాద్రి జిల్లాల మధ్య అటూఇటూ ..3లో

# గోదావరి జలాలను అడ్డుపెట్టుకుని.. తెలంగాణను కొల్లగొట్టారు

**--మనోడు కార్పొరేటరుగా గెలవాలి**

యువకులను ఒక్కటే అడుగుతున్నా. భారాసభాజ పాలకు ఓట్లు వేసి కాంగ్రెస్ నేతలను అభివృద్ధి చేయమంటే ఎలా? నేను నిధులు ఇవ్వాలంటే కౌన్సిలర్లు, కార్పొరేటర్లు మనవాళ్లు ఉండాలి కదా.. ఎమ్మెల్యేలు, మంత్రుల సహకారంతో అభివృద్ధి పనులు చేయాలంటే మనవాళ్లు ఉండాలి. మన బస్తీ కాలనీలో సౌకర్యాలు కలగాలంటే మనోడు కార్పొరేటరుగా గెలవాలి.

**--అవును.. నేను రేవంతుద్దీన్‌నే..**

భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావుకు చెబుతున్నా. బలహీనవర్గాల కులగణన చేయించినందుకు సంతోషంతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ నన్ను రేవంత్‌గౌడ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఆ కులాలకు న్యాయం చేసినప్పుడు మా సహచర మంత్రి రాజనర్సింహ ఆనందంతో నన్ను రేవంత్ మాదిగ అన్నారు. మొదటిసారిగా మంత్రి వాకిటి శ్రీహరిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పుడు రేవంత్ ముదిరాజ్ అన్నారు. హైదరాబాద్‌లో సదర్ వేడుకలు నిర్వహించినందుకు నన్ను రేవంత్ యాదవ్ అని ప్రశంసించారు. మూసీ నది పరీవాహక ప్రాంతంలో స్వర్ణ దేవాలయాన్ని నిర్మిస్తుంటే.. సిక్కు సోదరులు సర్దార్ రేవంత్‌సింగ్ అన్నారు. ముస్లింలకున్న 4 శాతం రిజర్వేషన్‌ను కాపాడడంతో పాటు.. ఎమ్మెల్యే కాకున్నా అజారుద్దీన్‌ను మంత్రిని చేశాం. మేం ముస్లింల హక్కులు కాపాడుతున్నాం. ఈ కారణంగా రామచందర్‌రావు నన్ను రేవంతుద్దీన్ అన్నా.. నాకు సమస్య లేదు. అన్ని కులాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని నంబర్‌వన్ స్థానంలో ఉంచడానికే ప్రజలు నాకు అధికారం ఇచ్చారు.

**--పదేళ్లలో కేసీఆర్ రేషన్‌కార్డులే ఇవ్వలేదు..**

పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఒక్కసారి కూడా రేషన్‌కార్డులివ్వలేదు. మేం వచ్చాక.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రేషన్ కార్డులు మంజూరు చేసి.. 3.12 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం. కేసీఆర్ దొడ్డు బియ్యం ఇస్తే లబ్ధిదారులు వాటిని బర్రెలకు పెట్టేవాళ్లు. మా హయాంలో 50 లక్షల మంది పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్నాం. మహిళలు పుట్టింటికి, రాములవారి గుడికి రూపాయి ఖర్చు లేకుండా వెళ్తున్నారు. 1000 బస్సులను మహిళలకు ఇచ్చి వారిని యజమానులను చేశాం. హైదరాబాద్‌లోని శిల్పారామంలో మహిళలు 150 దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. 70 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం. కేసీఆర్‌కు అనుమానం ఉంటే ఫాంహౌస్ నుంచి ఎల్‌బీ స్టేడియానికి వచ్చి లెక్కపెట్టుకోవచ్చు. ఉద్యోగాల లెక్కలో ఒక్క తలకాయ తగ్గినా.. నా తల తీసుకుంటా'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**--అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

అంతకు ముందు సీఎం.. మూడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, తెలంగాణ విశ్వవిద్యాలయంలో.. ఆడిటోరియం, పరిపాలన భవనం, ఇండోర్ స్టేడియం తదితరాలకు శంకుస్థాపన చేశారు. స్వయం సహాయక సంఘాలకు రూ.200 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఇటీవల నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల కారు దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ సౌమ్య కుటుంబసభ్యులకు, దొంగ రియాజ్ చేతిలో హత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబసభ్యులకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను ముఖ్యమంత్రి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఆర్మూర్ భాజపా ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహేర్‌బిన్ అందాన్, డీసీసీ అధ్యక్షుడు నగేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం నగరపాలక సంస్థ, పురపాలిక బరిలో ఉన్న అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు.

**మాది విక్టరీ జోడీ**

'2023లో పీసీసీ అధ్యక్షుడిగా నేను, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ పనిచేసి అధికారంలోకి వచ్చాం. 2004, 2009లలో ధర్మపురి శ్రీనివాస్ పీసీసీ అధ్యక్షుడిగా ఉండి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. ఆ విధంగానే 2029లో మహేశ్‌గౌడ్, నేను అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటాం' అని సీఎం తెలిపారు.




# 6 గ్యారంటీల్లో ఒక్కటైనా అమలు చేశారా?



ఈ పార్లమెంటు నియోజకవర్గం నుంచి రెండోసారి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ జిల్లా ప్రజలకు చేసిందేమీ లేదు. కాంగ్రెసోళ్లు మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి.. పురుషుల వద్ద డబుల్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో భారాస అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. సమావేశంలో భారాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# 14%ముస్లిం రిజర్వేషన్లకు రేవంత్‌రెడ్డి యత్నం



శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ''ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ పార్టీ 4 శాతం ముస్లిం రిజర్వేషన్లను ప్రవేశపెట్టిన సందర్భంలో హైకోర్టు వాటిని రెండుసార్లు కొట్టివేసింది. కాంగ్రెస్ సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే పొంది అమలు చేస్తోంది. కులసర్వే ముసుగులో కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఒక సర్వే నిర్వహించి రాష్ట్రంలో బీసీ జనాభాను పెద్దమొత్తంలో తగ్గించడానికి ప్రయత్నించింది. తెలంగాణ జనాభాలో నిజమైన బీసీలు 46 శాతం ఉన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ 10శాతం ముస్లింలనూ బీసీలలో చేర్చి రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతంగా పేర్కొంది. బీసీలు, ముస్లింలకు కలిపి వారు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కేటాయించారు. దీంతో బీసీలకు ప్రస్తుతం ఉన్న 34% కోటా 32 శాతానికి తగ్గుతుంది. ఇప్పుడు మత ప్రాతిపదికన 4శాతం రిజర్వేషన్లు కల్పించి, అదనంగా 10 శాతం జోడించి, కాంగ్రెస్ ముస్లింలను బీసీ వర్గాలలోకి అక్రమంగా చొప్పించడానికి ప్రయత్నిస్తోంది. దీనివల్ల అర్హులైన బీసీలకు నష్టం వాటిల్లుతుంది. బీసీలు తమ ఓట్లతోనే కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారు'' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

--కాంగ్రెస్, భారాస తోడు దొంగలు

రాష్ట్రంలో భారాస కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం సోనియా కుటుంబ పాలన సాగిస్తోందని.. ఈ రెండు పార్టీలు తోడు దొంగలని కిషన్‌రెడ్డి విమర్శించారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో భాజపా నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. అనంతరం సభలో మాట్లాడారు. కేసీఆర్‌ను ఫాంహౌస్‌కు పంపినట్లే హామీలు నెరవేర్చని కాంగ్రెస్ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు.

# భారీ ఎన్‌కౌంటర్



అప్పట్లో సంచలనం...: స్వామి 1993 సెప్టెంబరులో నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం పడ్కల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న తీరు అప్పట్లో ఒక సంచలనం. సిర్నాపల్లి దళం సమావేశం ముగించుకొని రాత్రివేళ ఒక ఇంట్లో సేద తీరుతున్న సమయంలో పోలీసులు చుట్టుముట్టడంతో ఇరువైపులా కాల్పులు చోటు చేసుకున్నాయి. ఇద్దరు మహిళా నక్సలైట్లు పోలీసులకు చిక్కారు. డిప్యూటీ కమాండర్ సంజీవ్ హతం కాగా.. ఇంట్లో స్వామితోపాటు గోపి, క్రాంతి మిగిలారు. రాత్రంతా కొనసాగిన కాల్పులు తెల్లవారుజామున ఆగిపోవడంతో పోలీసులు 4గంటల ప్రాంతంలో ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పుడు మావోయిస్టులు కాల్పులు జరపడంతో ఓ పోలీస్ మరణించాడు. పోలీసుల కాల్పుల్లో గోపికి తీవ్ర గాయాలయ్యాయి. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో డీఐజీ అక్కడికి చేరుకొని నక్సలైట్లను లొంగిపొమ్మని సూచించారు. క్రాంతి లొంగిపోయేందుకు ఇంటి నుంచి బయటికి వచ్చాడు. గోపీ తనను తాను కాల్చుకొని చనిపోగా.. స్వామి ఇంట్లోనే ఉండిపోయాడు. మరుసటి రోజు రాత్రి 7 గంటల సమయంలో పోలీసులు ఇంటికి నిప్పు పెట్టగా స్వామి తలుపు తెరుచుకొని మెట్ల దగ్గరికి చేరుకున్నాడు. అక్కడ పడి ఉన్న ఏకే47ను తీసుకొని కాల్పులకు దిగడంతో పోలీసులు వెనక్కి తగ్గగా గోడ దూకి పారిపోయాడు. అదేరోజు రాత్రి ఒక ఇంట్లోకి వెళ్లి దాహం తీర్చుకుని చెత్తకుప్పలో దాక్కొన్నాడు. మూడోరోజు ఉదయం ఓ మహిళ ఆశ్రయం కల్పించడంతో రోజంతా ఆ ఇంట్లోనే ఉండి రాత్రి పారిపోయాడు. అలా తీవ్ర ఉత్కంఠ తర్వాత తప్పించుకోవడంతో అతడి పేరు పడ్కల్ స్వామిగా మారిపోయింది.

# ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని మహిళను ఒత్తిడి చేయలేం: సుప్రీంకోర్టు



మహారాష్ట్రకు చెందిన ఓ మైనర్ అమ్మాయి.. స్నేహితుడితో సంబంధం కారణంగా కొన్ని నెలల క్రితం గర్భం దాల్చింది. అప్పుడు ఆమె వయసు 17ఏళ్లు కాగా.. ప్రస్తుతం ఆమె వయసు 18 సంవత్సరాల నాలుగు నెలలు. ఇప్పుడు ఆమె 30 వారాల గర్భిణి. ఈ క్రమంలో గర్భవిచ్ఛిత్తి కోసం అమ్మాయి తొలుత బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. తొలగింపు నిబంధనల (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం) ప్రకారం గడువు మించిపోవడంతో కోర్టు అందుకు నిరాకరించింది. అనంతరం ఈ అంశం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. గర్భిణీ నిర్ణయానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, ముఖ్యంగా గర్భధారణ కొనసాగింపుపై అయిష్టత వ్యక్తం చేసిన పరిస్థితుల్లో ఆమె స్వేచ్ఛకు వదలివేయాలని సూచించింది. అయితే, ఈ కేసులో పిండం కూడా ఒక ప్రాణమే అయినప్పటికీ.. మరో మార్గం లేదని పేర్కొంది. ఎంటీపీ చట్టం ప్రకారం గడువు ముగిసినప్పటికీ గర్భవిచ్ఛిత్తి జరుగుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని సుప్రీం ధర్మాసనం గుర్తుచేసింది. ఇటువంటి సందర్భాల్లో బాధితులు ఎక్కడికి వెళ్తారనే ప్రశ్నను ధర్మాసనం లేవనెత్తింది. నకిలీ, అనధికార వైద్యుల వద్దకు వెళ్తారని.. అది మరింత ప్రమాదకరమని అభిప్రాయపడింది. ఈ కేసులో గర్భవిచ్ఛిత్తికి అనుమతించినా అమ్మాయికి ఎటువంటి ప్రమాదం ఉండదని వైద్యులు ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొ

# మార్కులపై వ్యామోహం వద్దు



నా అభిప్రాయం ఏమిటంటే, ఒక్కొక్కరు ఒక్కో విధంగా పనిచేస్తుంటారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానాలు కూడా భిన్నంగా ఉంటాయి. కొందరు ఉదయం వేళ బాగా చదువుతారు. మరి కొందరు రాత్రి సమయంలో. అందరి సలహాలూ తీసుకోండి. చిట్టచివరగా మీకు అత్యంత అనువుగా, ప్రయోజనకరంగా ఉన్న విధానాన్నే అనుసరించండి" అని విద్యార్థులకు ప్రధాని సూచించారు.

**పరీక్షా పే చర్చ సందర్భంగా విద్యార్థులతో ప్రధాని**

**ఇంకా 25 ఏళ్లు మిగిలి ఉన్నాయి**

"నా వయసు 75 ఏళ్లకు చేరిందని జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఓ నాయకుడు అన్నారు. మరో 25 ఏళ్లు మిగిలి ఉన్నాయని ఆయనకు సమాధానం చెప్పాను. గతాన్ని గణించను. మిగిలిన సమయాన్నే లెక్కిస్తాను. మీకు చెప్పేదేమిటంటే, గడిచిపోయిన కాలం గురించి ఆలోచిస్తూ సమయం వృథా చేసుకోకండి. జీవన వికాసంపై శ్రద్ధ పెట్టండి. అది తరగతి గదులు, పరీక్షల పరిధిలో లేని విలువైన అంశం" అని మోదీ తెలిపారు.

**ఇంటర్నెట్‌లో గడపకండి**

"డేటా చౌకగా వస్తోంది కదా అని ఇంటర్నెట్‌లో సమయం వృథా చేసుకోకండి. సరదాగా గేమ్స్ ఆడుతూ కాలాన్ని గడిపేయకండి. డబ్బుపై ఆశతో గేమ్స్ ఆడితే జీవితాలు నాశనం అవుతాయి. అందుకే మా ప్రభుత్వం జూదం లాంటి ఆటలను ప్రోత్సహించడం లేదు. ఆన్‌లైన్ జూదానికి వ్యతిరేకంగా ఒక చట్టాన్ని కూడా చేశాం" అని మోదీ పేర్కొన్నారు.

# పాక్‌లో మారణహోమం



169 మంది గాయపడ్డారు. ఇస్లామాబాద్‌లోని తర్లాయి ప్రాంతంలో ఖదీజతుల్ కుబ్రా అనే షియా మసీదు ఉంది. పోలీసులు, పలువురు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం శుక్రవారం ప్రార్థనలు జరుగుతుండగా ఆ మసీదు వద్దకు ఓ ఆత్మాహుతి బాంబర్ వచ్చాడు. అతణ్ని గేటు వద్దే భద్రతాసిబ్బంది ఆపగా, తనను తాను పేల్చేసుకున్నాడు. పేలుడు తీవ్రతకు పలువురి అవయవాలు తెగిపడ్డాయి. మృతదేహాలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. పోలీసులు, ఇతర సిబ్బంది అక్కడికి చేరుకొని.. గాయపడ్డవారిని ఆసుపత్రులకు తరలించారు. ఆత్మాహుతి బాంబర్ తొలుత కాల్పులు జరిపి, తర్వాత తనను తాను పేల్చేసుకున్నాడని మరో ప్రత్యక్ష సాక్షి తెలపడం గమనార్హం. తమ ప్రమేయం లేదన్న టీటీపీ: ఆత్మాహుతి దాడి తమ పనేనని ఇప్పటివరకూ ఉగ్రవాద సంస్థలేవీ ప్రకటించలేదు. ఆత్మాహుతి బాంబర్ విదేశీయుడని పోలీసువర్గాలు చెబుతున్నాయి. అతడికి తెహ్రీక్‌ఎతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ)తో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్నాయి. దాడిలో తమ ప్రమేయం లేదని టీటీపీ స్పష్టంచేసింది. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ గురువారం పాక్‌కు చేరుకున్నారు. ఆయన పర్యటన కొనసాగుతుండగానే ఇస్లామాబాద్‌లో ఈ దాడి జరగడం గమనార్హం. మరోవైపు మసీదు వద్ద దాడిలో భారత్, అఫ్గానిస్థాన్‌ల ప్రమేయం ఉందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ నిరాధార ఆరోపణలు చేశారు. వీటిని భారత్ నిర్ద్వంద్వంగా ఖండించింది.

# ట్రంప్ నోబెల్ పాట్లు .. మిత్రదేశం చీవాట్లు

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ బహుమతికి నామినేట్ చేయడానికి పోలండ్ నిరాకరించడం ఇరుదేశాల మధ్య దౌత్య వివాదానికి దారితీసింది. ఈ పరిణామాలను అగ్రరాజ్య దౌత్యవేత్త తీవ్రంగా ఖండించగా.. పోలండ్ ప్రధాని ఘాటుగా బదులిచ్చారు. అసలేం జరిగిందంటే.. మధ్యప్రాచ్యంలో శాంతియుత పరిస్థితులు నెలకొల్పేలా చేసినందుకు గానూ.. వచ్చే ఏడాది నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును నామినేట్ చేయాలని అమెరికా, ఇజ్రాయెల్ నుంచి పోలండ్ పార్లమెంట్‌కు ప్రతిపాదనలు వచ్చాయి. దీన్ని పోలండ్ స్పీకర్ తిరస్కరించారు. ''బలవంతపు రాజకీయాలు, విధానాలతో ట్రంప్ అంతర్జాతీయ సంస్థలను అస్థిరపరుస్తున్నారు. ఆయన నోబెల్‌కు అనర్హులు. ఈ ప్రతిపాదనను మేం తిరస్కరిస్తున్నాం'' అని పోలండ్ స్పీకర్ ప్రకటించారు. ఈ చర్యను అమెరికా తీవ్రంగా పరిగణించింది. దీనిపై పోలండ్‌లోని అమెరికా దౌత్యవేత్త టామ్ రోజ్ స్పందిస్తూ.. ''ఇది ట్రంప్‌ను అవమానించడమే. దీనివల్ల ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఆయనను మా దేశంలోకి రానివ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేస్తాం'' అని పేర్కొన్నారు. దీనిపై పోలండ్ ప్రధాని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ''మిత్ర దేశాలు పరస్పరం గౌరవించుకోవాలి. అంతేగానీ ఇలా మాకు పాఠాలు చెప్పే ప్రయత్నం చేయొద్దు. దౌత్య సంబంధాలు ఎలా నిర్వహించాలో మాకు తెలుసు'' అని హితవు పలికా



# అడవి లేదు.. ఆకలి తీరట్లేదు



ఈ రెండు జిల్లాల్లో పెద్దపులి గడిచిన 50 ఏళ్లలో కనిపించలేదని అటవీశాఖవర్గాల సమాచారం. మరోవైపు పెద్దపులి కదలికలతో జనం భయాందోళనలకు గురవుతున్నారు. ఈ పులి యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక ప్రాంతం నుంచి లింగాలఘనపురం మండలం కుందారం శివారులో సంచరించినట్లు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. శుక్రవారం రఘునాథపల్లి మండలం మండలగూడెం పరిసరాల్లో ఓ రైతుకు చెందిన లేగదూడపై దాడిచేసి చంపింది. ఘటనా స్థలాన్ని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారులు కొండల్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, డీఎఫ్‌వో లావణ్య పరిశీలించి, పులి పాదముద్రల్ని గుర్తించారు. ఈ నేపథ్యంలో పోలీసు, అటవీశాఖలు పలు సూచనలు చేశాయి. రాత్రిపూట ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, అవసరమైతే గుంపులుగా మాత్రమే వెళ్లాలని సూచించాయి. పెద్దపులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపాయి. మహారాష్ట్ర పాండవఖారా డివిజన్ నుంచి గత ఏడాది నవంబరులో తెలంగాణలోకి ప్రవేశించిన పెద్దపులి కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో కొద్దిరోజులు ఉంది. తర్వాత అక్కడినుంచి జిల్లాల్లోకి ప్రవేశించింది.

--ఆటంకం కలిగించొద్దు

తాజా పరిణామాలపై అటవీశాఖ పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ ఎప్పటికప్పుడు సమాచారాన్ని జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (ఎన్టీసీఏ)కు పంపిస్తున్నారు. 'పెద్దపులిని కలవరపెట్టొద్దు. చంపిన పశుమాంసాన్ని తిననివ్వాలి. ఆకలి తీరిపోతేనే పులికి ఆందోళన తగ్గుతుంది. అటవీప్రాంతం వైపు వెళుతుంది. పశువుల్ని చంపిన చోట జనాల్ని గుమికూడనివ్వవద్దు' అంటూ ఎన్టీసీఏ నుంచి ఆదేశాలు వచ్చినట్లు సువర్ణ తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్దపులుల జాడల్ని అనుసరించే అనుభవం ఉన్న 9మంది ట్రాకర్లను కాగజ్‌నగర్, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల నుంచి అటవీశాఖ పిలిపించింది. ఒకవేళ పులి దాడిలో పశువులు చనిపోయినట్టు ఎవరైనా ఫిర్యాదు చేస్తే మూడు రోజుల్లో పరిహారం ఇస్తామని అటవీశాఖ స్థానికులకు చెబుతోంది.

--ఎట్టకేలకు చిక్కిన పెద్దపులి

న్యూస్‌టుడేరాయవరం, మండపేట గ్రామీణం: తూర్పుగోదావరి జిల్లాలో ఏడు రోజులుగా అధికారులను పరుగులు పెట్టిస్తూ.. ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసిన పెద్దపులి ఎట్టకేలకు శుక్రవారం రాత్రి పట్టుబడింది. మహారాష్ట్రలోని తాడోబా ప్రాంతం నుంచి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాలోకి వచ్చిన పులి వారంరోజులుగా తూర్పుగోదావరి జిల్లాల్లోని అభయారణ్యాలు, గోదావరి పరీవాహక ప్రాంతాలు, పొలాల్లో సంచరించింది. రాజానగరం, రాజమహేంద్రవరం గ్రామీణ మండలాల్లో 8 మూగజీవాలను చంపింది. శుక్రవారం ఉదయం మండపేట మండలం కేశవరం పరిసరాల్లో సంచరిస్తూ.. కూర్మాపురంలోని పాలచర్ల రాజుకు చెందిన ఓ శిథిలగృహంలోకి చొరబడింది. అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు చేరుకుని దాన్ని బంధించేందుకు ఏర్పాట్లు చేశారు. పులిపై మత్తు ఇంజక్షన్ ప్రయోగానికి నిపుణులు ఏర్పాట్లు చేసుకుంటుండగా శుక్రవారం మధ్యాహ్నం 1.30 సమయంలో శిథిలగృహం నుంచి బయటకొచ్చి వరి పొలాల్లోకి పరుగులు తీసింది. అక్కడినుంచి శివారులోని ఇళ్ల సమీపంలోకి, తర్వాత సమీప దుర్గమ్మ గుడి సమీపంలోని కొలగాని సత్తిబాబుకు చెందిన పశువుల పాకలోకి చేరి సాయంత్రం వరకు అక్కడే నిద్రపోయింది. పులి కదలికలను అంచనా వేసిన నిపుణులు పశువుల పాక చుట్టూ, సమీప భవనాల మధ్య వలలు వేశారు. పాకలోని రెండు గేదెలపై పులి దాడికి ప్రయత్నించగా అవి తీవ్రంగా ప్రతిఘటించడంతో పులి బయటకు వచ్చింది. గన్‌తో మత్తు ఇంజక్షన్ ప్రయోగించినా విఫలమైంది. వంద మీటర్ల దూరం వెళ్లిన పులిపై రెండోసారి ప్రయోగించగా విజయవంతమై అక్కడి చెరువుగట్టు వద్ద మత్తుతో పడిపోయింది. వెంటనే బంధించి రాజమహేంద్రవరం తరలించారు.

# నల్గొండ..ఎవరికి అండ?

**–కార్పొరేషన్ చేసింది మేమే.. సూపర్ స్మార్ట్ సిటీగా మారుస్తామంటున్న కాంగ్రెస్**

**–పదేళ్ల పాలన చూసి ఓటేయాలంటున్న భారాస**

**–నగర పాలికలకు సింహభాగం నిధులు మావే అంటున్న భాజపా**

ఈ కబురు, నల్గొండ : నల్గొండగా మారిన నీలగిరి ఉద్యమాలకు ఊపిరి.. ధిక్కార ధ్వనులకు అస్తిత్వ ప్రతీక. 1951లో 8 వార్డులతో పురపాలక సంస్థగా ఏర్పడిన నల్గొండ క్రమక్రమంగా 48 వార్డులతో గ్రేడ్1 పురపాలక సంఘమైంది. 2026 జనవరి 14న రాష్ట్ర ప్రభుత్వం దీన్ని నగరపాలిక సంస్థగా మార్చింది. 48 వార్డులు డివిజన్లు అయ్యాయి. తొలిసారి మేయర్ జనరల్ మహిళకు రిజర్వయింది.

నల్గొండ పురపాలికకు 1953 నుంచి 2020 వరకు 13 సార్లు ఎన్నికలయ్యాయి. 8 సార్లు కాంగ్రెస్, భాజపా రెండుసార్లు, తెదేపా రెండుసార్లు, భారాస ఒకసారి ఛైర్మన్ పీఠాలు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి వెంకట నర్సింహారావు తొలి ఛైర్మన్‌గా గెలిచారు. 202024 వరకు మందడి సైదిరెడ్డి(భారాస) ఉండగా అతనిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.అప్పటి నుంచి 202425 వరకు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి(కాంగ్రెస్) ఛైర్మన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం అతని సతీమణి బుర్రి చైతన్యరెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

--పార్టీల బలాలు.. బలహీనతలు

ప్రధాన పార్టీలన్నీ నల్గొండ తొలి మేయర్ పీఠంపై గురి పెట్టాయి. కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా 48 డివిజన్లలో పోటీ చేస్తోంది. భారాస47, భాజపా45, జనసేన9, మజ్లిస్8, బీఎస్పీ2, సీపీఐ(ఎం)1, ఎఐఎఫ్‌బీ (ఫార్వర్డ్ బ్లాక్)9, ఇతరులు 52 మంది కలిపి 221 మంది పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రెండేళ్లలో తమ ప్రభుత్వం ఏం చేసిందో ప్రచార కార్యక్రమాల ద్వారా తెలియజేస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. నగరపాలికగా మార్చింది మా ప్రభుత్వమని చెబుతూ సూపర్ స్మార్ట్ సిటీగా నగరాన్ని తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నారు. సీఎంరేవంత్‌రెడ్డి పర్యటనతో పాటు ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ క్షేత్రస్థాయిలో అభ్యర్థులందరి తరపున ప్రచారం చేస్తుండటం కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశాలు. టికెట్ల కేటాయింపు సమయంలో ఫిర్యాదులు, అక్కడక్కడ అసంతృప్తుల బెడద ప్రతికూలాంశాలు. తమ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని చెబుతూ భారాస నేతలు ఓటర్ల మద్దతు కోరుతున్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌ఛార్జి ప్రస్తుత ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిలు ఆరు గ్యారంటీల హామీల విఫలంపై ప్రచారం చేస్తున్నారు. నాయకుల మధ్య విభేదాలు, మేయర్ అభ్యర్థిని ప్రకటించకపోవడం, అక్కడక్కడ అసంతృప్తులు ఇబ్బందికరం. కేంద్ర ప్రభుత్వం నుంచి స్మార్ట్ సిటీ, అమృత్ నిధులను తీసుకొచ్చేది భాజపా అని చెబుతూ నగర ఓటర్ల మద్దతు కూడగట్టుతున్నారు. ప్రధాని మోదీ మేనియా కలిసి వచ్చే అంశాలు. ఆంధ్రలో మిత్రపక్షం జనసేన ఇక్కడ 9 స్థానాల్లో పోటీ




చేస్తుండటం, మాజీ కౌన్సిలర్లకు మొండిచెయ్యి వంటివి ప్రతికూలంగా మారనున్నాయి.

-కార్పొరేషన్ చేసింది మేమే.. సూపర్ స్మార్ట్ సిటీగా మారుస్తామంటున్న కాంగ్రెస్
-పదేళ్ల పాలన చూసి ఓటేయాలంటున్న భారాస
-నగర పాలికలకు సింహభాగం నిధులు మావే అంటున్న భాజపా
ఈ కబురు, నల్గొండ : నల్గొండగా మారిన నీలగిరి ఉద్యమాలకు ఊపిరి.. ధిక్కార ధ్వనులకు అస్తిత్వ ప్రతీక. 1951లో 8 వార్డులతో పురపాలక సంస్థగా ఏర్పడిన నల్గొండ క్రమక్రమంగా 48 వార్డులతో గ్రేడ్1 పురపాలక సంఘమైంది. 2026 జనవరి 14న రాష్ట్ర ప్రభుత్వం దీన్ని నగరపాలిక సంస్థగా మార్చింది. 48 వార్డులు డివిజన్లు అయ్యాయి. తొలిసారి మేయర్ జనరల్ మహిళకు రిజర్వయింది.
నల్గొండ పురపాలికకు 1953 నుంచి 2020 వరకు 13 సార్లు ఎన్నికలయ్యాయి. 8 సార్లు కాంగ్రెస్, భాజపా రెండుసార్లు, తెదేపా రెండుసార్లు, భారాస ఒకసారి ఛైర్మన్ పీఠాలు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి వెంకట నర్సింహారావు తొలి ఛైర్మన్‌గా గెలిచారు. 202024 వరకు మందడి సైదిరెడ్డి(భారాస) ఉండగా అతనిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.అప్పటి నుంచి 202425 వరకు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి(కాంగ్రెస్) ఛైర్మన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం అతని సతీమణి బుర్రి చైతన్యరెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.
--పార్టీల బలాలు.. బలహీనతలు
ప్రధాన పార్టీలన్నీ నల్గొండ తొలి మేయర్ పీఠంపై గురి పెట్టాయి. కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా 48 డివిజన్లలో పోటీ చేస్తోంది. భారాస47, భాజపా45, జనసేన9, మజ్లిస్8, బీఎస్పీ2, సీపీఐ(ఎం)1, ఎఐఎఫ్‌బీ (ఫార్వర్డ్ బ్లాక్)9, ఇతరులు 52 మంది కలిపి 221 మంది పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రెండేళ్లలో తమ ప్రభుత్వం ఏం చేసిందో ప్రచార కార్యక్రమాల ద్వారా తెలియజేస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. నగరపాలికగా మార్చింది మా ప్రభుత్వమని చెబుతూ సూపర్ స్మార్ట్ సిటీగా నగరాన్ని తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నారు. సీఎంరేవంత్‌రెడ్డి పర్యటనతో పాటు ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ క్షేత్రస్థాయిలో అభ్యర్థులందరి తరపున ప్రచారం చేస్తుండటం కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశాలు. టికెట్ల కేటాయింపు సమయంలో ఫిర్యాదులు, అక్కడక్కడ అసంతృప్తుల బెడద ప్రతికూలాంశాలు. తమ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని చెబుతూ భారాస నేతలు ఓటర్ల మద్దతు కోరుతున్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌ఛార్జి ప్రస్తుత ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిలు ఆరు గ్యారంటీల హామీల విఫలంపై ప్రచారం చేస్తున్నారు. నాయకుల మధ్య విభేదాలు, మేయర్ అభ్యర్థిని ప్రకటించకపోవడం, అక్కడక్కడ అసంతృప్తులు ఇబ్బందికరం. కేంద్ర ప్రభుత్వం నుంచి స్మార్ట్ సిటీ, అమృత్ నిధులను తీసుకొచ్చేది భాజపా అని చెబుతూ నగర ఓటర్ల మద్దతు కూడగట్టుతున్నారు. ప్రధాని మోదీ మేనియా కలిసి వచ్చే అంశాలు. ఆంధ్రలో మిత్రపక్షం జనసేన ఇక్కడ 9 స్థానాల్లో పోటీ చేస్తుండటం, మాజీ కౌన్సిలర్లకు మొండిచెయ్యి వంటివి ప్రతికూలంగా మారనున్నాయి.

# నడి సముద్రంలో ఒడిశా నేవీ ఇంజినీర్ అదృశ్యం!

**–కేంద్రం సాయం కోరిన సీఎం మోహన్‌చరణ్ మాఝి**

**ఈ కబురు, నెట్‌వర్క్ : ఒడిశాకు చెందిన ఓ యువ నేవీ ఇంజినీర్ నడి సముద్రంలో అదృశ్యమయ్యారు. ఈ ఘటన సింగపూర్ తీరానికి చేరువలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రక్ జిల్లా సధైకెలా గ్రామానికి చెందిన సార్థక్ మహాపాత్ర్ 2025 జులైలో మర్చంట్ నేవీలోని ఓ ప్రైవేట్ షిప్‌లో ఉద్యోగంలో చేరి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 2న ఆయన వాళ్ల అమ్మ రశ్మితాతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ సమయంలో సార్థక్ సింగపూర్ తీరానికి చేరువలో సముద్రంలో ఉన్నారు. అయితే, మరుసటి రోజు ఆయన తల్లికి నౌక యాజమాన్యం నుంచి ఫోన్ వచ్చింది. ఉదయం అల్పాహారం తీసుకున్న తర్వాత నుంచి సార్థక్ కనిపించడం లేదని, కారణాలు తెలియలేదని తెలిపారు. దాంతో అప్పటి నుంచి ఆయన తల్లి గుండెలవిసేలా రోదిస్తున్నారు. గురువారం ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝిని, ఇతర ఉన్నతాధికారులను ఆమె కలిశారు. తన కుమారుడిని కాపాడాలని కోరారు. ఈ నేపథ్యంలో సాయం కోసం సీఎం కేంద్రానికి లేఖ రాశారు. దిల్లీలో ఉన్న రెసిడెంట్ కమిషనర్ విశాల్ గగన్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విపక్షనేత నవీన్ పట్నాయక్ సైతం కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని, సార్థక్ ఆచూకీ తెలుసుకోవాలని 'ఎక్స్' వేదికగా శుక్రవారం కోరారు.**



# మమ్మల్ని గెలిపిస్తే... ఎలాంటి పన్నుల పెంపూ ఉండదు



**–భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు**

**–మున్సిపల్ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల**

ఈ కబురు, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీని గెలిపిస్తే.. అర్బన్ ప్రాంతాలను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతామని, అవినీతి రహిత పాలనే తమ లక్ష్యమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన 'వికసిత తెలంగాణ భాజపా సంకల్ప పత్రం' పేరుతో మున్సిపల్ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేశారు. ''భాజపాను గెలిపిస్తే పెండింగ్‌లో ఉన్న పన్నులకు సంబంధించి వెసులుబాటు కల్పిస్తాం. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తాం. యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. కాంగ్రెస్ వాళ్లు కొన్ని చోట్ల భాజపా కార్యకర్తలపై దాడి చేసి నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేశారు. పోలీసులు తప్పుడు కేసులు పెడితే ఊరుకోం. కేంద్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి.. భాజపా రాష్ట్రానికి ఏమిచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఏ జిల్లాకు ఏమిచ్చామనే వివరాలతో భాజపా త్వరలో పుస్తకం విడుదల చేయనుంది. భారాస, కాంగ్రెస్‌లు అర్బన్ ప్రాంతాలను ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. భాజపాకు ఒక్క అవకాశం ఇస్తే కేంద్రం ఇచ్చే నిధులతో తీర్చిదిద్దుతుంది'' అని రామచందర్‌రావు అన్నారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్‌ను కిషన్‌రెడ్డి కాపాడుతున్నట్టు సీఎం చేసిన ఆరోపణలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు రామచందర్‌రావు బదులిచ్చారు. 'సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ ఒకరినొకరు కాపాడుకున్నారు. గతంలో ఓటుకు నోటు కేసులో కేసీఆర్.. రేవంత్‌రెడ్డిని తప్పించారు. ఇప్పుడు కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టులో రూ.1.30 లక్షల అవినీతి జరిగితే కేవలం డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ కోరి, భాజపాను ఇరుకున పెట్టే ఎత్తుగడ చేస్తోంది' అని అన్నారు.

--నేడు ఉమ్మడి ఆదిలాబాద్‌లో మహారాష్ట్ర సీఎం ప్రచారం

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ శనివారం ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మూడు పట్టణాల్లో భాజపా తరపున మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం మంచిర్యాల పట్టణంలో, అనంతరం ఆసిఫాబాద్‌లో ప్రచారం చేస్తారు. సాయంత్రం కాగజ్‌నగర్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. పార్టీ వర్గాలు ఈ వివరాలు వెల్లడించాయి.

--మ్యానిఫెస్టోలో ఇచ్చిన మరికొన్ని హామీలు

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఇంటి పన్ను సహా ఎలాంటి పన్నుల పెంపూ ఉండదు. ఆన్‌లైన్‌లో సింగిల్ విండో విధానం ద్వారా వారం రోజుల్లో ఇంటి నిర్మాణ అనుమతులు. దోమలు, కోతులు, కుక్కల బెడద నివారణ. ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు అండర్‌పాస్‌లు, వంతెనల నిర్మాణం. ప్రధాన జన ఔషధి ద్వారా తక్కువ ధరకు మందులు. పాలనలో ప్రజల భాగస్వామ్యం, పౌరుల నుంచి సూచనల సేకరణ పచ్చదనంతో వెల్లివిరిసేలా పార్కుల నిర్మాణం

# రైలు పట్టాలపై బాంబులు పెట్టాం



**జిహాదీ పేరుతో రైల్వే అధికారులకు బెదిరింపు లేఖ**

**–వందేభారత్ రైళ్లకు భద్రత పెంపు**

ఈ కబురు, రెజిమెంటల్‌బజార్ : రైలు పట్టాలపై బాంబులు పెట్టి వందేభారత్ రైలును పేల్చేందుకు సిద్ధంగా ఉన్నామని జిహాదీ బృందం పేరుతో రైల్వే అధికారులకు ఆగంతకుల నుంచి లేఖ రావడంతో జీఆర్పీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. రోజూ సికింద్రాబాద్ నుంచి బయలుదేరి వెళ్తున్న వందేభారత్ రైళ్లలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపడుతున్నారు. ఈ నెల 3న సికింద్రాబాద్ రైల్ నిలయంలోని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు హైదరాబాద్‌లో ఉంటున్న అజ్ఞాత వ్యక్తుల నుంచి ఓ లేఖ వచ్చింది. వందేభారత్ రైలును పేల్చడానికి రైలు పట్టాలపై బాంబులు అమర్చామని, ఎక్కువగా ప్రాణనష్టం జరుగుతుందని అందులో రాశారు. జిహాదీ బృందం పేరుతో నలుగురి పేర్లు కూడా ఉన్నట్లుగా తెలిసింది. ఈ మేరకు అధికారులు రైల్వే ఆర్పీఎఫ్ అధికారుల ద్వారా సికింద్రాబాద్ జీఆర్పీకి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. వందేభారత్ రైళ్లకు భద్రతను కట్టుదిట్టం చేశారు.

# హిందువులు నిద్రాణం వీడాలి .. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈ కబురు, అమరావతి: 'మనం కేవలం భక్తులుగా ఉంటే సరిపోదు. మన విశ్వాసాలకు స్పృహతో రక్షకులుగా ఉండాలి. ఎవరైనా దురుద్దేశంతో మన ధర్మాన్ని, విశ్వాసాన్ని ఉద్దేశపూర్వకంగా ఎగతాళి చేస్తే మన బాధను వ్యక్తం చేయాల్సిన బాధ్యత మనదే. అలాంటి సందర్భాల్లో మౌనంగా ఉంటే సామూహిక ఆత్మవిశ్వాసం బలహీనపడుతుంది. హిందూ ధర్మ రక్షణ అంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదు. అది సొంత ధర్మాన్ని, విశ్వాసాన్ని కాపాడుకోవడమే' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'ప్రతి భక్తుడికీ ఒక ధార్మిక బాధ్యత ఉంది. సాధారణ హిందువు మనస్తత్వంలోని నిద్రాణం, సౌకర్యవాదం నుంచి మనం బయటపడాలి. ఎవరైనా హిందూ దేవతలను అపవిత్రం చేసినప్పుడు, మన ధర్మాన్ని ఎగతాళి చేసినప్పుడు ఒంటరిగా బాధపడి, కర్మపై వదిలేసి ముందుకు సాగిపోతాం. ఈ విధానం మార్చుకోవాలి. జాతి, మతం, ప్రాంతం, భాషల వారీగా విభజన జరిగినా ధర్మం ఒక్కటే. దేవతలు అందరికీ ఒకేలా ఉంటారు' అని ఆయన అభివర్ణించారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు



దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మరింత దిగొచ్చాయి. క్రితం రోజుతో పోలిస్తే వీటి ధరలు స్వల్పంగా తగ్గాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1,58,000 పలికింది. గురువారంతో పోలిస్తే దాదాపు రూ.1600 తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,39,650గా ఉంది. మరోవైపు, కేజీ వెండి ధర రూ.9వేలు దిగొచ్చి రూ.2,60,000 పలికింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఔన్సు పసిడి (Gold) ధర 4,864 డాలర్లు, ఔన్సు వెండి (Silver) ధర 74 డాలర్లుగా కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి డెలివరీ కాంట్రాక్టుకు వెండి 2 శాతం తగ్గి కిలో ధర రూ.2.38 లక్షల వద్ద ఉంది. ఏప్రిల్ డెలివరీలకు పసిడి ధర స్వల్పంగా పెరిగి 10 గ్రాముల ధర రూ.1.52 లక్షలకు చేరింది.

# డిజిటల్ మోసాల్లో రూ.25వేల వరకు పరిహారం

## ఆర్‌బీఐ ప్రతిపాదనలు

ముంబయి: డిజిటల్ మోసాల బారినపడే బాధితులకు ఊరట కలిగించేలా ఆర్‌బీఐ ఓ ప్రకటన చేసింది. చిన్న మొత్తంలో ఉన్న మోసపూరిత లావాదేవీల్లో కస్టమర్లకు జరిగిన నష్టానికి గానూ రూ.25వేలు వరకు పరిహారం ఇచ్చేలా ఓ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఆర్‌బీఐ (RBI) గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ''డిజిటల్ చెల్లింపుల భద్రతను పెంచడంపై మేం చర్చలు జరుపుతున్నాం. వినియోగదారుల రక్షణ నిమిత్తం మూడు ముసాయిదా మార్గదర్శకాలను రూపొందించాం. బ్యాంకుల్లో అనైతిక విక్రయాలను (మిస్‌సెల్లింగ్) అరికట్టడం, రుణాల రికవరీ రికవరీ ఏజెంట్ల ప్రవర్తన, అనధికార డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలలో వినియోగదారుల బాధ్యతను పరిమితం చేయడంపై ఈ మార్గదర్శకాలు ఉంటాయి. ఇక, చిన్న మొత్తంలో మోసపూరిత లావాదేవీలు జరిగిన కేసుల్లో బాధిత కస్టమర్లకు రూ.25వేలు వరకు పరిహారం ఇచ్చేలా ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకొచ్చేలా ప్రతిపాదనలు చేశాం'' అని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వివరించారు. ఇందుకు సంబంధించి ప్రజల అభిప్రాయాలను స్వీకరించేందుకు ఆ మార్గదర్శకాలను, ఫ్రేమ్‌వర్క్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకుల్లో అనైతిక విధానాల్లో విక్రయించే ఆర్థిక సేవలు, ఉత్పత్తుల వల్ల కస్టమర్లతో పాటు బ్యాంకింగ్ సంస్థలు కూడా పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆర్‌బీఐ గవర్నర్ ఈ సందర్భంగా తెలిపారు. బ్యాంకు కౌంటర్ల వద్ద విక్రయించే ఈ థర్డ్ పార్టీ ఉత్పత్తులు, సేవలు కస్టమర్లకు ఎంతవరకు అవసరమో, ఎంతవరకు భద్రమైనవి అనే వాటిపై ప్రమాణాలు నిర్దేశించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలోనే వాటి అడ్వర్టైజింగ్, మార్కెటింగ్, సేల్స్‌పై సమగ్ర ఆదేశాలు జారీ చేయాలని నిర్ణయించినట్లు సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.




# ఐడీబీఐ బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా విక్రయం మార్చిలోపే పూర్తి




ఐడీబీఐ బ్యాంక్‌లో తన వాటా విక్రయ ప్రక్రియను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే (2025 26) ప్రభుత్వం పూర్తి చేయనుంది. ఈ బ్యాంకులో ఎల్ఐసీ, ప్రభుత్వానికి కలిపి 90% వాటా ఉంది. ఇందులో నుంచి ఎల్ఐసీ 30.24%, ప్రభుత్వం 30.38% చొప్పున దాదాపు 61% వాటాను విక్రయించనున్నాయి.

ఈ వాటా కొనుగోలు చేసేందుకు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎమిరేట్స్ ఎన్‌బీడీ, ఫెయిర్‌ఫ్యాక్స్ ఇండియా హోల్డింగ్స్ తమ తుది బిడ్‌లను ఈ వారంలోనే సమర్పించనున్నాయని సంబంధిత వర్గాల సమాచారం. బిడ్‌ల సమర్పణ తర్వాత లావాదేవీల సలహాదార్లు, అంతర్‌మంత్రిత్వ బృందం (ఐఎంజీ), బిడ్డర్‌ల తరఫు ప్రతినిధుల సమక్షంలో ఈ బిడ్‌లు తెరుస్తారు. ఇందులో ఎంపిక చేశాక, ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపిస్తారు. ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటా విక్రయం కోసం ఆసక్తి గల సంస్థల నుంచి ఆర్థిక బిడ్‌లు వచ్చాయని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) కార్యదర్శి అరుణిష్ చావ్లా తెలిపారు. ఈ ప్రక్రియ అంతా 2025 26లోనే పూర్తవుతుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఐడీబీఐ బ్యాంక్‌లో 30.48% వాటా విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ.33,000 కోట్లు సమకూరే అవకాశం ఉంది.

# 50 లక్షలు దాటిన ఫాస్టాగ్ వార్షిక పాస్ యూజర్లు..

## చండీగఢ్ టాప్

జాతీయ రహదారులపై టోల్ భారాన్ని తగ్గించే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌కు (FASTag Annual Pass) వాహనదారుల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. దేశవ్యాప్తంగా ఈ పాస్‌ను తీసుకున్న వినియోగదారుల సంఖ్య 50 లక్షలు దాటింది. ఇప్పటివరకు 26.55 కోట్ల లావాదేవీలు జరిగినట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. వార్షిక పాస్ వినియోగంలో చండీగఢ్ అగ్రస్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా జరిగే మొత్తం వార్షిక పాస్ లావాదేవీల్లో 14 శాతం ఈ ప్రాంతం నుంచే జరుగుతున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. తమిళనాడు (12.3 శాతం), దిల్లీ (11.5 శాతం) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దిల్లీ రాజధాని ప్రాంతంలోని బిజ్వాసన్ ప్లాజా వద్ద వార్షిక పాస్ వినియోగం అధికంగా ఉంది. ఈ టోల్‌గేట్‌ను దాటే మొత్తం కార్లలో 57 శాతం వార్షిక పాస్‌ను వినియోగించినట్లు గణాంకాలు పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో ఉన్న ముందాక, సోనిపట్‌లోని జింజోలి టోల్ ప్లాజాలు 53 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దేశంలో 1150 జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలపై టోల్‌ప్లాజాల వద్ద చెల్లుబాటు అయ్యేలా గతేడాది ఆగస్టు 15న ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఒక్కసారి రూ.3 వేలు చెల్లిస్తే ఏడాది పాటు లేదా 200 టోల్ క్రాసింగులకు ఈ పాస్ పనిచేస్తుంది. నాన్ కమర్షియల్ వాహనాలకు ఇది వర్తిస్తుంది. రాజమార్గ్ యాత్ర లేదా ఎన్‌హెచ్ఏఐ వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులు చేసిన రెండు గంటల్లోనే ఈ పాస్ యాక్టివేట్ చేసుకోవచ్చు. ఒక్కో టోల్ గేట్ దాటేందుకు అయ్యే ఖర్చు రూ.15 మాత్రమేనని కేంద్రం పేర్కొంది.




# కిమ్స్ ఆదాయం రూ.1,003 కోట్లు

KIMS HOSPITALS™

కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో తొలిసారిగా రూ.1,000 కోట్ల ఆదాయ మైలురాయిని అధిగమించింది. సమీక్షా త్రైమాసిక ఆదాయం రూ.1,003 కోట్లుగా నమోదైంది. 202425 ఇదే కాల ఆదాయం రూ.790 కోట్ల కంటే, ఇది 27% అధికం.

ఇదే సమయంలో సంస్థ నికర లాభం మాత్రం రూ.93 కోట్ల నుంచి రూ.52 కోట్లకు పరిమితమైంది. కొత్తగా ప్రారంభించిన బెంగళూరు, థానే యూనిట్ల నిర్వహణ ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని సంస్థ వివరించింది. చికిత్స కోసం వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని, ఒక్కో పడక ద్వారా వచ్చే సగటు ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 20.5% వృద్ధితో రూ.46,341కి చేరుకుందని పేర్కొంది. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రల్లోని 25 ఆసుపత్రుల్లో సంస్థకు 7,100 పడకల సామర్థ్యం ఉంది. వివిధ దశల్లో ఉన్న కొత్త ఆసుపత్రుల ద్వారా, పడకల సామర్థ్యం 9,100కు చేరుతుందని కిమ్స్ సీఎండీ బి.భాస్కర రావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరాన్ని మరింత వృద్ధితో ముగిస్తామన్న విశ్వాసం ఉందన్నారు.

# భారీగా పతనమైన బిట్‌కాయిన్



క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ (Bitcoin) విలువ భారీగా పతనమైంది. ఒకేరోజు 12%కి పైగా పతనమై 63,295 డాలర్లకు చేరింది. 2024 తర్వాత ఒకరోజు అత్యధిక పతనం ఇదే కావడం గమనార్హం. ఒక దశలో 60వేల డాలర్లకు కూడా పడిపోయింది. విలువైన లోహాలలో అస్థిరత, ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు ఈ పరిస్థితికి కారణమైంది. దాంతో దాదాపు 1 బిలియన్ డాలర్ల విలువైన బిట్‌కాయిన్ పొజిషన్లను మదుపర్లు వదిలించుకున్నారని క్రిప్టోకరెన్సీ యాప్ కాయిన్‌గ్లాస్ డేటా వెల్లడించింది.

**నష్టాల్లో స్టాక్ మార్కెట్..**దేశీయ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి (Stock Market). ఉదయం 9.45 గంటల సమయంలో సెన్సెక్స్ 323 పాయింట్ల నష్టంతో 82,990 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 117 పాయింట్లు కోల్పోయి 25,525 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో బజాజ్ ఫైనాన్స్, కొటక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టీఎంపీవీ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ స్టాక్స్ నష్టాల్లో కదలాడుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 90.25గా ఉంది.

# 7న ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె..

## డిమాండ్లు ఇవే



కనీస ఛార్జీలు, డ్రైవర్ల పని పరిస్థితులపై ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్లు శనివారం (ఫిబ్రవరి 7న) దేశవ్యాప్త సమ్మెకు దిగనున్నారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ సమ్మె నిర్వహిస్తున్నారు.

కనీసం ఆరు గంటల పాటు డ్రైవర్లు ఈ సమ్మెలో పాల్గొంటారని కార్మిక సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. సమ్మె కారణంగా దేశవ్యాప్తంగా క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలకు అంతరాయం ఏర్పడనుంది. సమ్మెలో పాల్గొనే డ్రైవర్ల సంఖ్యను బట్టి ఆయా ప్రాంతాల్లో సేవల్లో సమ్మె తీవ్రత కనిపించనుంది. కనీస ఛార్జీలు, గిగ్ వర్కర్ల పని పరిస్థితులను నిరసిస్తూ ఈ ఆందోళన చేపడుతున్నట్లు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్ పేర్కొంది. క్యాబ్ సేవలను నియంత్రించేందుకు తీసుకొచ్చిన మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్, 2025 ఉన్నప్పటికీ ఆయా ప్లాట్‌ఫామ్స్ మాత్రం ఇష్టానుసారం ఛార్జీలు నిర్ణయిస్తున్నాయని కార్మికసంఘాలు పేర్కొంటున్నాయి. కాబట్టి ప్రభుత్వమే జోక్యం చేసుకుని కనీస ఛార్జీలను నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేటు వాహనాలను కమర్షియల్ అవసరాలకు వినియోగించడంపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. డ్రైవర్ల ఆదాయానికి రక్షణ కల్పించడంతో పాటు, పని పరిస్థితుల మెరుగు కోరుతూ ఈ సమ్మె చేపడుతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ వర్కర్లు సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో కేంద్రం చొరవ తీసుకుని 10 నిమిషాల డెలివరీ హామీని తొలగించాలని ఆయా కంపెనీలకు సూచించింది. దీంతో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో 10 నిమిషాల హామీని తొలగించాయి.


# మళ్లీ ధరలు పెంచక తప్పదేమో

## –ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్



వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) తగ్గింపు రూపేణ కార్ల కొనుగోలుదార్లకు ప్రయోజనం కలిగిందని.. అయితే డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సుమారు 19% క్షీణించిన నేపథ్యంలో, కార్ల ధరలను పెంచక తప్పడం లేదని ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ అన్నారు. దీని ప్రభావంతో రాబోయే కొన్ని నెలల్లో మరోసారి ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి రావచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆడి గ్లోబల్ ప్రోగ్రెసివ్ కాన్సెప్ట్ షోరూంను వీవీసీ మోటార్స్ ఛైర్మన్ వీవీ రాజేంద్రప్రసాద్, వీవీసీ ఆడి హైదరాబాద్ సెంట్రల్ డీలర్ ప్రిన్సిపల్ వికాస్ చౌదరితో కలిసి ప్రారంభించిన ధిల్లాన్ మాట్లాడారు. ఏడాది కాలంలో కార్ల ధరలను 45% పెంచినట్లు గుర్తు చేశారు. అయినా కూడా కరెన్సీ విలువ రూపేణ తయారీ వ్యయం పెరుగుతున్నందునే, మరోసారి పెంచక తప్పదన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 30 షోరూములు, సర్వీస్ సెంటర్లతో కలిసి 67 టచ్ పాయింట్లు ఉన్నాయని తెలిపారు. కొత్త ప్రాంతాలకు విస్తరించేటప్పుడు ముందుగా వర్క్‌షాప్‌లు, ఆడి అప్రూవ్డ్ ప్లస్ కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడ గిరాకీ పెరిగాక షోరూములు నెలకొల్పాలన్నది తమ వ్యూహమని వివరించారు. దేశంలో లగ్జరీ కార్లు ఏడాదికి 51,000 అమ్ముడవుతున్నాయని.. ఐటీ రంగంలోని ఒడిదుడుకులను, స్థిరాస్తిరిటెయిల్ రంగాల వృద్ధి భర్తీ చేస్తోందని ఆయన విశ్లేషించారు. గత ఏడాదిలో మొత్తం 4510 ఆడి కార్లు విక్రయించినట్లు తెలిపారు. త్వరలోనే దేశీయ మార్కెట్లోకి ఒక కొత్త స్పోర్ట్స్ కారుతో పాటు, మరో విద్యుత్ మోడల్ విడుదల చేసే ప్రణాళికలు ఉన్నట్లు పేర్కొన్నారు.

# లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్ సూచీలు



దేశీయ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి (Stock Market). ఆర్‌బీఐ వడ్డీ రేట్ల ప్రకటన నేపథ్యంలో ఉదయం నష్టాల నుంచి సూచీలు కొద్దిమేర లాభపడ్డాయి. సెన్సెక్స్ 266 పాయింట్లు లాభపడి, 83,580 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 50 పాయింట్లు పెరిగి, 26,693 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 83,249 వద్ద ప్రారంభమై ఒక దశలో 83,612 వద్ద గరిష్ఠాన్ని తాకింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 36 పైసలు కోల్పోయి.. 90.70గా స్థిరపడింది. నిఫ్టీ సూచీలో ఐటీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్ షేర్లు రాణించగా.. టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఆటో షేర్లు నష్టాలను చవిచూశాయి. ఆంథ్రోపిక్ కొత్త ఐటీ టూల్స్‌పై ప్రకటన చేయడంతో ఐటీ షేర్లలో నష్టాలు మరోరోజు కొనసాగాయి.

# హైదరాబాద్‌లో యాపిల్ ఉద్యోగావకాశాలు

దేశీయంగా సొంతంగా రిటెయిల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న ఐఫోన్ల సంస్థ యాపిల్, హైదరాబాద్‌లో తదుపరి విక్రయ కేంద్రాన్ని ప్రారంభించే యోచనలో ఉంది. ఇందుకోసమే ఉద్యోగుల ఎంపిక కోసం ప్రకటనలు ఇస్తోంది. యాపిల్ తన కెరీర్ పోర్టల్‌లో అవుట్‌లెట్ మేనేజర్, సీనియర్ మేనేజర్, స్టోర్ లీడర్, రిటెయిల్ మేనేజర్, టెక్నికల్ స్పెషలిస్ట్, బిజినెస్ ఎక్స్‌పర్ట్స్, ఆపరేషన్స్ ఎక్స్‌పర్ట్‌స్‌తో పాటు పూర్తి కాలానికి, పార్ట్‌టైమ్, కాంట్రాక్ట్ ఎక్స్‌పర్ట్స్, మేనేజర్స్ వంటి వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది బెంగళూరు, పుణె, నోయిడాల్లో యాపిల్ తన స్టోర్లను ప్రారంభించింది. 2023లో ముంబయి, దిల్లీల్లో స్టోర్లకు సంస్థ శ్రీకారం చుట్టిన సంగతి విదితమే. 2023లో యాపిల్ బీకేసీ పేరుతో ముంబయిలో, తర్వాత యాపిల్ సాకేత్ పేరుతో దిల్లీలో, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో మొదలైంది.



# బాలీవుడ్‌లో 90శాతం పెళ్లిళ్లు ఫేక్..

## 'హిట్3' విలన్ ఆసక్తికర వ్యాఖ్యలు



బాలీవుడ్‌లో 90శాతం పెళ్లిళ్లు ఫేక్ అని అంటున్నారు నటుడు ప్రతీక్ స్మిత పాటిల్. నటుడు రాజ్ బబ్బర్ తనయుడిగా ఇండస్ట్రీలోకి వచ్చినా.. కుటుంబంలో నెలకొన్న సమస్యల కారణంగా తండ్రికి దూరంగా ఉంటున్నారు. గతేడాది ప్రియా బెనర్జీతో ప్రతీక్ వివాహం జరిగినా తండ్రిని ఆహ్వానించలేదు. తాజాగా సతీమణితో కలిసి ప్రతీక్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో బంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ప్రజలకు చాలా వరకూ వాస్తవాలు తెలియవు. ఇండస్ట్రీలో ఉన్న కొంతమందికే అవి తెలుస్తాయి. కానీ, ఏదో ఒక రోజు అందరికీ నిజం తెలిసి తీరుతుంది. అది ఓ కథ, పుస్తకం, ఇంటర్వ్యూ, లేదా సినిమాగా రావచ్చు'' అని అన్నారు. తమ పెళ్లికి ముందు జీవితం ఎన్నో పరీక్షలు పెట్టిందని ప్రియా బెనర్జీ అన్నారు. ఎవరి స్థాయికి తగినట్లు వారికి సమస్యలు ఎదురవుతూ ఉంటాయన్నారు. అలా వచ్చిన ప్రతి సమస్యకు స్పందించాల్సిన అవసరం లేదని.. ఆ సమయంలో ఒకరికి ఒకరు తోడుగా ఉన్నామని తెలిపారు. ''బాలీవుడ్‌లో 90శాతం వివాహ బంధాలు ముసుగుతోనే ఉంటాయి. మేము ఇండస్ట్రీలో ఉన్నాం కాబట్టి మాకు తెలుసు. పెళ్లయిన వాళ్లే.. 'రాత్రి అయిపోతే, విషయం అయిపోయినట్టే' అంటున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఒకరినొకరు మోసగించుకోవడం ఫ్యాషన్ అయిపోయింది. అది ఒక్కరితో ఆగడం లేదు. మన సంస్కృతి గొప్పది. కానీ, ఇక్కడ (బాలీవుడ్) చాలా మంది పెళ్లిని ఒక జోక్‌లా చూస్తున్నారు'' అంటూ అటు ప్రతీక్, ఇటు ప్రియా బెనర్జీ చెప్పుకొచ్చారు. ప్రతీక్ 'బచన్ పాండే,' 'సికిందర్' సహా పలు బాలీవుడ్ చిత్రాల్లో నటించారు. తెలుగులో నాని నటించిన 'హిట్ 3'లో విలన్‌గా చేశారు.

# పవర్‌ఫుల్ టైటిల్‌తో తరుణ్ భాస్కర్ మూవీ..

## 'జీపీఎస్' అంటే ఇదే






ఓ సినిమా థియేటర్లలో సందడి చేస్తుండగానే.. మరో కొత్తకబురు చెప్పారు దర్శక, నటుడు తరుణ్ భాస్కర్. 'జీపీఎస్' అంటూ ఇటీవల సోషల్ మీడియాలో ఆసక్తి పెంచిన ఆయన.. తాజాగా దానిని రివీల్ చేశారు. తాను హీరోగా నటిస్తున్న కొత్త సినిమా పేరే జీపీఎస్. పూర్తి పేరు 'గాయపడ్డ సింహం'. ''గాయపడ్డ సింహం నుంచి వచ్చే శ్వాస.. గర్జన కన్నా భయంకరంగా ఉంటుంది'' అంటూ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. 'డోన్ట్ లాఫ్.. ఇట్స్ ఏ సీరియస్ మ్యాటర్' క్యాప్షన్‌ను బట్టి ఈ సినిమా కామెడీ నేపథ్యంతో రూపొందుతున్నట్లు అర్థమవుతోంది. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ టీజర్ ఈ నెల 9న విడుదల కానుంది. 'పెళ్లి చూపులు', 'ఈ నగరానికి ఏమైంది' తదితర సినిమాలతో దర్శకుడిగా సత్తా చాటిన తరుణ్.. 'మహానటి', 'సీతారామం'లాంటి చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే. హీరోగా చేసిన తొలి సినిమా 'ఓం శాంతి శాంతి శాంతిః' కొన్ని రోజుల క్రితమే విడుదలైంది.

# చిత్ర పరిశ్రమకు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వ తలుపు తట్టొచ్చు

**–ఉగాది రోజునే గద్దర్ సినీ పురస్కారాల ప్రదానం**

**–తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**





మణిశర్మ, మల్లు భట్టి విక్రమార్క, దిల్ రాజు

హైదరాబాద్ నగరంలోని సానుకూలమైన వాతావరణాన్ని ఉపయోగించుకుంటూ... తెలంగాణని ప్రపంచ సినీ కేంద్రంగా మార్చాలన్నదే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసం కార్యాచరణని కూడా సిద్ధం చేశామన్నారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క. సినిమాలతో సామాజిక సందేశాన్ని ఇవ్వడంతోపాటు ఎంతో మందికి ఉపాధి అవకాశాల్ని కల్పించవచ్చన్నారు. వాణిజ్య పరంగానూ లబ్ధి పొందుతూ, ప్రపంచం దృష్టినీ ఆకర్షించవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి కీలకమైన చిత్ర పరిశ్రమకు ఏ అవసరం వచ్చినా తెలంగాణ ప్రభుత్వం సాయంగా ఉంటుందన్నారు. ఆయన ముఖ్య అతిథిగా శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ గద్దర్ సినీ పురస్కారాలు 2025 స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మల్లు భట్టివిక్రమార్క మాట్లాడారు. ''తెలంగాణ ప్రాంత సామాజిక మార్పు కోసం కళల్ని ఉపయోగించి... ప్రజల కోసం తన జీవితాన్ని ధారబోసిన మహనీయుడు గద్దర్. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఆయన పేరుపైనే సినీ పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించాం. విజయవంతంగా రెండో ఏడాది పురస్కారాల్ని ప్రదానం చేస్తున్నాం. సమయాభావంతో గతేడాది కుదరలేదు కానీ, ఈసారి మాత్రం ఉగాది రోజునే వేడుకని చేస్తున్నాం. తెలంగాణలో సినిమా రంగాన్ని వ్యవస్థీకృతం చేయాలని ప్రజా ప్రభుత్వం కృషిచేస్తోంది. పరిశ్రమకు ఆర్థిక, సామాజిక, శాంతి భద్రతల పరంగా ఎలాంటి అవసరం వచ్చినా తమ ప్రభుత్వ తలుపు తట్టొచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నేను ఎప్పుడూ అందుబాటులో ఉంటాం. పురపాలక ఎన్నికల కారణంగా వాళ్లు ఈ వేడుకకి రాలేకపోయారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు ఈ పురస్కార వేడుక నిర్వహణని ఎంతో బాధ్యతాయుతంగా ముందుకు తీసుకెళుతున్నారు. జ్యూరీ ఛైర్మన్ మణిశర్మ నేతృత్వంలో కమిటీ తరతమ బేధాలు లేకుండా నిష్పక్షపాతంగా అవార్డుల ఎంపిక కార్యక్రమాన్ని చేపడుతుంద''న్నారు భట్టి విక్రమార్క. టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ ''ఈసారి పురస్కారాల కోసం 90 సినిమాలు పోటీ పడుతున్నాయి. అందులో 68 ఫీచర్, మరికొన్ని లఘు చిత్రాలు ఉన్నాయి. మార్చి 5లోపు జ్యూరీ సభ్యులు సినిమాల్ని వీక్షించి అవార్డుల్ని ఎంపిక చేస్తార''న్నారు. అవార్డుల జ్యూరీ కమిటీ ఛైర్మన్ మణిశర్మ మాట్లాడుతూ ''ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి గతంలో ఎన్నో రికార్డింగులు చేసే అవకాశం దొరికింది. గద్దర్ చివరి రోజుల్లో కూడా ఆయనతో కలిసి మేం ఇద్దరం కొన్ని పాటల్ని రికార్డ్ చేశాం. 1987లో కీ బోర్డ్ ప్లేయర్‌గా ప్రయాణం మొదలుపెట్టిన నేను, 1997లో సంగీత దర్శకుడినయ్యా. ఇప్పటివరకూ 250 సినిమాలకు సంగీతం అందించా. గద్దర్ పురస్కారాల జ్యూరీకి ఛైర్మన్‌గా కొత్త బాధ్యతల్ని చేపట్టా'' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ డైరెక్టర్ కిశోర్‌బాబుతోపాటు జ్యూరీ సభ్యులు పాల్గొన్నారు.

# యశ్ టాక్సిక్.. భారీ ధరకు తెలుగు రాష్ట్రాల రైట్స్!




శాండల్‌వుడ్ హీరో యశ్ నటిస్తోన్న మోస్ట్ అవేటేడ్ యాక్షన్ థ్రిల్లర్ టాక్సిక్. కేజీఎఫ్ 2 తర్వాత రాకింగ్ స్టార్ ఈ మూవీతోనే ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఇటీవల టీజర్ రిలీజ్ చేయగా పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. ముఖ్యంగా బోల్డ్ సీన్ పెట్టడంపై దర్శకురాలిపై విమర్శలు చేశారు. ఈ చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహంచారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మార్చి 19న థియేటర్లలో సందడి చేయనుంది. అయితే ఈ సినిమా కోసం టాలీవుడ్ సినీ ప్రియులు సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో టాక్సిక్ మూవీ గురించి ఓ వార్త సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఇప్పటికే ఈ మూవీ తెలుగు థియేట్రికల్ రైట్స్‌ను భారీ డీల్‌కు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ థియేట్రికల్ పంపిణీ హక్కుల కోసం ఏకంగా రూ. 120 కోట్ల ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సమాచారం. ఇదే జరిగితే ఓ డబ్బింగ్ చిత్రానికి ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద డీల్‌గా రికార్డ్ సృష్టించనుంది. ఈ మూవీ తెలుగు రాష్ట్రాల డిస్ట్రిబ్యూషన్ హక్కులను ప్రముఖ నిర్మాత దిల్‌రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (SVC) సొంతం చేసుకుంది. దీంతో ఈ సినిమాపై టాలీవుడ్ అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమాకు ఇదొక బిగ్ డీల్ అని టాలీవుడ్‌లో చర్చ మొదలైంది.ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ.. 'యశ్ సినిమా రంగంలో ఒక పవర్‌ఫుల్ స్టార్‌గా ఎదిగారు. కేజీఎఫ్ 2 తర్వాత ప్రపంచవ్యాప్తంగా అతని మార్కెట్ మరింత పెరిగింది. ఈ చిత్రంపై అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణ తర్వాత వస్తోన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను అందించడానికి థ్రిల్‌గా ఉన్నాం. భవిష్యత్తులో యశ్‌తో మరిన్ని చిత్రాలకు కలిసి పనిచేస్తాం' అని అన్నారు.ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్ స్టర్ మైండ్ క్రియేషన్స్పై వెంకట్ కె.నారాయణ, యష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇంగ్లీష్, కన్నడ భాషల్లో నేరుగా, హిందీ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ మూవీలో కియారా అద్వానీ, నయన తార, హూమా ఖురేషి, తారా సుతారియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా.. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందించారు.




# విశ్వక్ సేన్ ఫంకీ

## .. ట్రైలర్ రిలీజ్ డేట్ ఫిక్స్




టాలీవుడ్ హీరో విశ్వక్ సేన్ నటించిన తాజా చిత్రం ఫంకీ. ఈ మూవీకి 'జాతిరత్నాలు' ఫేమ్ దర్శకుడు అనుదీప్ దర్శకత్వం పహించారు. గతేడాది హిట్ మూవీ లేకపోవడంతో ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు మాస్ కా దాస్. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కయాదు లోహర్ కనిపించనుంది. ఇప్పటికే టీజర్ రిలీజ్ చేసిన మేకర్స్.. ప్రమోషన్స్‌తో దూసుకెళ్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన బిగ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఫంకీ ట్రైలర్ రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ నెల 7న మూసాపేట్‌లోని శ్రీరాములు థియేటర్‌లో ట్రైలర్ లాంఛ్ చేయనున్నట్లు పోస్టర్ పంచుకున్నారు.

ఇప్పటికే రిలీజైన పాటలు, టీజర్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇక ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్ ఫిబ్రవరి 13న థియేటర్లలో విడుదల కానుంది.

# 'క్రిష్ 4'కి అంగీకారం?




తన దగ్గరికి వచ్చిన ప్రతి అవకాశానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోయినా.. ఉన్నట్టుండి అదిరిపోయే కథతో తెరపై మెరిసిపోతుంటుంది అందాల తార ప్రియాంక చోప్రా. త్వరలో మహేశ్‌బాబుతో కలిసి 'వారణాసి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించడానికి ముస్తాబవుతోందీమె. కొన్ని రోజులుగా ప్రియాంక 'క్రిష్ 4'లో భాగం కాబోతున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు దీని గురించి మరో ఆసక్తికర విషయం నెట్టింట్లో చక్కర్లు కొడుతుంది. తాజాగా ఆమె 'క్రిష్ 4'లో నటించడానికి అంగీకారం చెప్పిందని, మళ్లీ హిందీ చిత్రపరిశ్రమలోకి రావడానికి ప్రియాంక చాలా ఉత్సాహంగా ఉందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యాక్షన్ హీరో హృతిక్ రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. దర్శకత్వం వహిస్తున్న తొలి చిత్రమిది. అంతరిక్ష నేపథ్యం, టైమ్ ట్రావెల్ కథగా ఈ సినిమా ఉండనుందని, త్వరలో చిత్రీకరణను మొదలెట్టనున్నారని సమాచారం. మరి మానవాతీత శక్తులు కలిగిన క్రిష్‌తో ప్రియాంక విన్యాసాలు చేస్తుందో లేదో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

# జపాన్ మ్యాగజైన్‌పై ప్రభాస్



ప్రఖ్యాత జపాన్ మ్యాగజైన్ అనన్ బ్యాక్ కవర్‌పై కనిపించనున్న తొలి భారతీయ సోలో కథానాయకుడిగా ప్రభాస్ చరిత్ర సృష్టించనున్నారు. ఈ నెల 10న విడుదల కానున్న ఆ మ్యాగజైన్‌పై ప్రభాస్‌కి ప్రేక్షకుల్లో ఉన్న ఆకర్షణని కీర్తిస్తూ ఆయన చిత్రాన్ని ప్రచురించనుంది. 'ఆర్.ఆర్.ఆర్' విడుదల తర్వాత రామ్‌చరణ్, ఎన్టీఆర్ కలిసి ఆ మ్యాగజైన్‌పై కనిపించారు. ఆ తర్వాత ప్రభాస్‌కి ఆ గౌరవం దక్కనుంది. అందుకు సంబంధించిన కవర్‌పేజీ ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. 'బాహుబలి' సినిమాలతో ప్రభాస్‌కి జపాన్‌లో విశేషమైన అభిమాన గణం ఏర్పడింది. అప్పట్నుంచి ఆయన సినిమాలు జపాన్‌లోనూ విడుదలవుతున్నాయి. 'కల్కి 2898 ఎ.డి' చిత్రం కూడా అక్కడ విడుదలై విజయవంతంగా ప్రదర్శితమైంది. అప్పుడే ప్రభాస్ త్వరలోనే జపాన్ వస్తానని అభిమానులకు చెప్పారు. ఆ మాట మేరకే గత డిసెంబరులో ప్రభాస్ టోక్యో వెళ్లారు. ఆ సందర్భంగానే కవర్‌ఫొటో షూట్ జరిగింది. ప్రభాస్ ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాలతో బిజీగా ఉన్నారు. త్వరలోనే 'కల్కి 2' కూడా పట్టాలెక్కనుంది.



# డ్యాన్స్‌తో అదరగొట్టిన శ్రీలీల

హీరోయిన్ శ్రీలీల ఈ ఏడాది పరాశక్తితో ప్రేక్షకుల ముందుకొచ్చింది. శివ కార్తికేయన్ హీరోగా వచ్చిన ఈ సినిమా.. బాక్సాఫీస్ వద్ద అంతగా మెప్పించలేకపోయింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సిద్ధమైంది. పవన్ కల్యాణ్ హీరోగా వస్తోన్న ఈ మూవీ మార్చి 26వ థియేటర్లలో సందడి చేయనుంది. ఇదిలా ఉంచితే శ్రీలీల తాజాగా హైదరాబాద్‌లోని ఓ మాల్ ఓపెనింగ్‌కు హాజరైంది. ఈ సందర్భంగా తన టాలెంటన్‌ను బయటపెట్టింది. అభిమానుల కోరిక మేరకు డ్యాన్స్‌తో అదరగొట్టేసింది. ఉస్తాద్ భగత్ సింగ్‌లోని దేక్‌లేంగే సాలా అంటూ సాగే పాటకు స్టెప్పులు వేసింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శ్రీలీల స్టెప్పులకు అక్కడున్న ఫ్యాన్స్ అందరూ ఫిదా అయిపోయారు.

# వరల్డ్ ఛాంపియన్స్‌గా భారత్



అండర్19 ప్రపంచకప్ 2026 విజేతగా భారత్ నిలిచింది. జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను 100 పరుగుల తేడాతో ఓడించిన యువ భారత్.. ఆరో వరల్డ్‌కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ తుది పోరులో మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోర్ సాధించింది. భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ టోర్నీ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయే ఇన్నింగ్స్ ఆడాడు. 14 ఏళ్ల వైభవ్ తన బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించాడు. కేవలం 80 బంతుల్లో 175 పరుగులు (15 ఫోర్లు, 15 సిక్సర్లు) చేసి ఫైనల్ మ్యాచ్ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. అతడితో పాటు కెప్టెన్ అయూశ్ మాత్రే(53), కనిష్క్ చౌహాన్ (37) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో జేమ్స్ మింటో మూడు వికెట్లు పడగొట్టగా.. సెబాస్టియన్ మోర్గాన్, అలెక్స్ గ్రీన్ తలా రెండు వికెట్లు సాధించారు.

**ఫాల్కనర్ వీరోచిత పోరాటం....** అనంతరం భారీ లక్ష్య చేధించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బ్యాటర్లలో కాలేబ్ ఫాల్కనర్ వీరోచిత పోరాటం కనబరిచాడు. ఓవైపు క్రమం తప్పకొండా వికెట్లు పడుతున్నప్పటికి ఫాల్కనర్ మాత్రం తన ప్రయత్నం ఆపలేదు. ఫాల్కనర్ బంతుల్లో 115 పరుగులు చేసి చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. అతడితో పాటు బెన్ డాకిన్స్ (66),థామస్ రెవ్(31) తమ వంతు ప్రయత్నం చేశారు. మిగితా బ్యాటర్లు మొత్తం దారుణంగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబరీష్ మూడు వికెట్లు పడగొట్టగా.. కనిష్క్ చౌహాన్, దీపేష్ దేవేంద్రన్ తలా రెండు వికెట్లు సాధించారు. ఫైనల్లో భారీ సెంచరీతో చెలరేగిన వైభవ్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు.

**హరారే:** వరుస విజయాలతో అండర్ 19 ప్రపంచప్ ఫైనల్ చేరిన యువ భారత్ తుది పోరులోనూ అదరగొడుతోంది. ఇంగ్లాండ్‌తో జరుగుతోన్న ఫైనల్‌లో.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. వైభవ్ సూర్యవంశీ (175) మెరుపు ఇన్నింగ్స్‌తో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఓపెనర్ ఆరోన్ జార్జ్(9) స్వల్ప స్కోరుకే వెనుదిరగ్గా.. మరో ఓపెనర్ సూర్యవంశీ మాత్రం అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే అర్ధ శతకం(53)తో రాణించగా.. అభిజ్ఞాన్ కుందు(40), వేదాంత్ త్రివేది (32) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3, మోర్గాన్ 2, అలెక్స్ గ్రీన్ 2, మానీ ఒక వికెట్ తీశారు.

**వైభవ్ వీరవిహారం.....** ఫైనల్‌లో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. సిక్సర్లు, ఫోర్లతో వీరవిహారం చేశాడు. 55 బంతుల్లో 8 ఫోర్లు, ఆరు సిక్సర్లతో శతకం పూర్తి చేసుకున్న అతడు.. ఆ తర్వాత మరింత చెలరేగి ఆడాడు. మరో 75 పరుగులను కేవలం 25 బంతుల్లోనే సాధించాడు. ఆ తర్వాత మానీ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. 218 స్ట్రైక్ రేట్‌తో.. 15 సిక్స్‌లు, 15 ఫోర్లను బాదాడంటే.. బౌలర్లను ఏ విధంగా ఊచకోత కోశాడో అర్థం చేసుకోవచ్చు. అండర్ 19 ప్రపంచకప్‌లో వేగవంతమైన సెంచరీ సాధించిన రెండో ఆటగాడు వైభవ్(55 బంతుల్లో). ఆసీస్ బ్యాటర్ విల్(51 బంతులు) ఇదే సిరీస్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ బాదాడు. అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్‌లో సెంచరీ చేసిన మూడో టీమ్‌ఇండియా బ్యాటర్ సూర్యవంశీ. ఇంతకుముందు ఉన్‌మక్త్ చంద్, మన్‌జోత్ కల్రా ఈ జాబితాలో ఉన్నారు. ప్రపంచకప్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు బాదింది కూడా సూర్యవంశీనే(15 సిక్స్‌లు).

## భారత్‌పాక్ మ్యాచ్‌పై ఐసీసీ కీలక నిర్ణయం




టీ20 ప్రపంచకప్2026లో భారత్‌పాకిస్తాన్ మ్యాచ్ దాదాపుగా లేనట్టే. ఈ హైవోల్టేజ్ మ్యాచ్‌కు సంబంధించి టికెట్ల అమ్మకాలను ఐసీసీ (ICC) తాత్కాలికంగా నిలిపివేసింది. షెడ్యూల్ ప్రకారం.. ఫిబ్రవరి 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో భారత్‌పాక్ జట్లు తలపడాల్సి ఉంది. కానీ రాజకీయ ఉద్రిక్తల కారణంగా భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కట్ చేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ పాక్ క్రికెట్ బోర్డు నుంచి ఇప్పటికీ ఐసీసీకి ఎటువంటి అధికారిక సమాచారం అందలేదు. ఈ మ్యాచ్‌ను బాయ్‌కట్ చేస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కొవల్సి వస్తుందని ఐసీసీ హెచ్చరించినప్పటకి పాక్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. శ్రీలంక క్రికెట్ బోర్డు కూడా పీసీబీకి లేఖ రాసింది. ఈ మ్యాచ్ రద్దయితే అన్ని విధాలగా తమ దేశం భారీగా నష్టపోతుందని ఆ లేఖలో శ్రీలంక క్రికెట్ పేర్కొంది. ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, బహిష్కరణ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని లంక బోర్డు కోరింది. అయినా కూడా పీసీబీ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ సందిగ్ధత వల్లే టికెట్లు విక్రయించిన తర్వాత ఒకవేళ మ్యాచ్ రద్దయితే, చట్టపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని ఐసీసీ బుకింగ్‌స్‌ను నిలిపివేసింది. ప్రేమదాస స్టేడియంలో జరిగే ఇతర ఎనిమిది మ్యాచ్‌ల టికెట్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. భారత్‌పాక్ మ్యాచ్ టికెట్లు మాత్రం బుకింగ్ పోర్టల్‌లో కనిపించడం లేదు. ఈ మెగా టోర్నీ శనివారం(ఫిబ్రవరి 7) నుంచి ప్రారంభం కానుంది.

## ఐసీసీ నుంచి ఇప్పటివరకైతే మాకేమీ సూచనలు రాలేదు: బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా



టీ20 వరల్డ్‌కప్ (ICC Mens T20 World Cup) 2026 షెడ్యూలు ప్రకారం.. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా 15న భారత్, పాక్ మ్యాచ్ జరగాల్సిఉంది. అయితే ఈ మ్యాచ్‌ను తాము బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమకు ఐసీసీ (ICC)నుంచి ఎలాంటి సూచనలు రాలేదని బీసీసీఐ (BCCI) సెక్రటరీ దేవజిత్ సైకియా (Devajit Saikia) అన్నారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (WPL Royal Challengers Bengaluru) డబ్ల్యూపీఎల్ (WPL) విజేతగా నిలిచిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఇప్పటివరకైతే మేం ఐసీసీ నుంచి ఎలాంటి సూచనలు అందుకోలేదు. షెడ్యూల్ ప్రకారం మేం సిద్ధమవుతున్నాం. భారత్‌లో అయిదు వేదికల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. అవి కోల్‌కతా, ముంబయి, దిల్లీ, అహ్మదాబాద్, చెన్నై. ఇక్కడ ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి' అని ఆయన అన్నారు. భారత్ ఆడబోయే మొదటి మ్యాచ్ గురించి కూడా మాట్లాడారు. 'భారత్, యూఎస్ఏ ఫిబ్రవరి 7న ముంబయి వేదికగా తమ మొదటి మ్యాచ్ ఆడబోతున్నాయి. అన్ని మ్యాచ్‌లు ఐసీసీ వరల్డ్ కప్ 2026 షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయి' అని సైకియా వివరించారు. అలాగే ఆయన పాక్ వివాదం పైనా స్పందించారు. 'ఎవరు ఆడతారో.. ఎవరు ఆడరో అనేది ఐసీసీ, ఆ దేశం (పాకిస్థాన్) మీద ఆధారపడి ఉంటుంది. ఐసీసీ ధ్రువీకరించేంతవరకు ఈ విషయంలో నేను ఏ సమాచారమూ ఇవ్వలేను' అని ఆయన అన్నారు.

## వైభవ్ వీరవిహారం.. 80 బంతుల్లో 175



హరారె: అండర్19 వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో టీమ్‌ఇండియా అదరగొడుతోంది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తుది పోరులో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. సిక్సర్లు, ఫోర్లతో వీరవిహారం చేశాడు. 55 బంతుల్లో 8 ఫోర్లు, ఆరు సిక్సర్లతో శతకం పూర్తి చేసుకున్న అతడు.. ఆ తర్వాత మరింత చెలరేగి ఆడాడు. మరో 75 పరుగులను కేవలం 25 బంతుల్లోనే సాధించాడు. ఆ తర్వాత మానీ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అతడి ఇన్నింగ్స్‌లో 15 సిక్స్‌లు, 15 ఫోర్లు ఉన్నాయి. ప్రస్తుతం భారత్ 29 ఓవర్లకు 3 వికెట్ల నష్టానికి 275 పరుగులతో ఆడుతోంది. క్రీజులో త్రివేది (22*), విహాన్ మల్హోత్రా (10*) ఉన్నారు. ప్రపంచకప్‌లో వేగవంతమైన సెంచరీ సాధించిన రెండో ఆటగాడు వైభవ్(55 బంతుల్లో). ఆసీస్ బ్యాటర్ విల్(51 బంతులు) ఇదే సిరీస్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ బాదాడు. అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్‌లో సెంచరీ చేసిన మూడో టీమ్‌ఇండియా బ్యాటర్ సూర్యవంశీ. ఇంతకుముందు ఉన్‌మక్త్ చంద్, మన్‌జోత్ కల్రా ఈ జాబితాలో ఉన్నారు. ప్రపంచకప్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు బాదింది కూడా సూర్యవంశీనే(15 సిక్స్‌లు)

## పొట్టి ప్రపంచకప్‌లో.. టీమ్‌ఇండియా ప్రస్థానం ఇదీ!



టీ20 ప్రపంచ కప్ 2026కు (ICC Mens T20 World Cup) కౌంట్‌డౌన్ మొదలైంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఇది 10వ ఎడిషన్ కాగా.. ఈ సారి 20 జట్లు పోటీ పడుతున్నాయి. భారత్ తొలి మ్యాచ్‌లో యూఎస్ఏతో (ఫిబ్రవరి 7, వాంఖడే స్టేడియం) తలపడనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ టీమ్‌ఇండియా (Team India).. ఇప్పుడు కూడా టైటిల్ సాధించి వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచిన తొలి జట్టుగా అవతరించాలని పట్టుదలతో ఉంది. మరి పొట్టి కప్ ఆరంభమైన 2007 నుంచి 2024 వరకు భారత్ రికార్డు ఎలా ఉందో ఓ లుక్కేద్దాం.టీ20 ప్రపంచ కప్ చరిత్రలో తొలి టైటిల్ నెగ్గింది టీమ్‌ఇండియానే. పెద్దగా అనుభవం లేని ఆటగాళ్లతో కూడిన భారత జట్టును మహేంద్రసింగ్ ధోనీ (MS Dhoni) విజయవంతంగా ముందుకు నడిపించాడు. ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను మట్టి కరిపించి భారత్ టైటిల్‌ను ముద్దాడింది. 2009 ఎడిషన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్.. కనీసం సెమీ ఫైనల్‌కు కూడా చేరలేదు. సూపర్8 దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ (వెస్టిండీస్, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా) టీమ్‌ఇండియా ఓటమి పాలైంది.

**అదిగో కప్పు.. ఇవిగో అడ్డంకులు.....**

వెస్టిండీస్‌లో జరిగిన 2010 టీ20 వరల్డ్ కప్‌లోనూ భారత జట్టు సూపర్8 దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

సూపర్8లో ఆస్ట్రేలియా, వెస్టిండీస్, శ్రీలంక చేతిలో పరాజయం చవి చూసింది. 2012 పొట్టి కప్‌లోనూ టీమ్‌ఇండియా సెమీస్‌కు చేరలేకపోయింది. సూపర్ 8 దశలో పాకిస్థాన్, సౌతాఫ్రికాపై నెగ్గినా.. నెట్ రన్‌రేట్ తక్కువగా ఉండటంతో సెమీ ఫైనల్ ఛాన్స్ మిస్ చేసుకుంది. ఇక 2014 ప్రపంచ కప్‌లో భారత్ మంచి ప్రదర్శనే చేసిందని చెప్పొచ్చు. అజేయంగా ఫైనల్‌కు చేరి.. టైటిల్ పోరులో శ్రీలంక చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2016 టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాను ఓడించి భారత్ సెమీస్‌కు చేరింది. సెమీ ఫైనల్‌లో వెస్టిండీస్ చేతిలో ఓటమి పాలైంది. అయిదేళ్ల తర్వాత 2021లో జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌కు చేదు అనుభవం ఎదురైంది. విరాట్ కోహ్లీ (Virat Kohli) నాయకత్వంలో బరిలోకి దిగిన భారత జట్టు సూపర్12 దశలోనే ఇంటిముఖం పట్టింది. 2022లో రోహిత్ శర్మ (Rohit Sharma) కెప్టెన్సీలోని భారత జట్టు సూపర్12లో అయిదు మ్యాచ్‌ల్లో నాలుగింట గెలిచి సెమీ ఫైనల్‌కు చేరింది. ఆ పోరులో ఇంగ్లాండ్ చేతిలో 10 వికెట్ల తేడాతో ఓడింది. 2024లో రోహిత్ నాయకత్వంలోనే బరిలోకి దిగిన టీమ్‌ఇండియా అదరగొట్టింది. ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా ఛాంపియన్‌గా నిలిచింది. టోర్నీ చరిత్రలో ఈ ఘనత అందుకున్న మొదటి జట్టుగా రికార్డు సృష్టించింది. సెమీస్‌లో ఇంగ్లాండ్‌ను, ఫైనల్‌లో సౌతాఫ్రికాను మట్టికరిపించి రెండో టైటిల్‌ను సొంతం చేసుకుంది.

# దమ్మున్నోడు



14 ఏళ్ల 316 రోజులు.. శుక్రవారం నాటికి వైభవ్ సూర్యవంశీ వయసు. సాధారణంగా ఈ వయసున్న పిల్లాడు ఆటలన్నీ కట్టిపెట్టి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతూ ఉండాలి. కానీ ఈ బిహార్ కుర్రాడు మాత్రం తనకంటే వయసులో నాలుగైదేళ్లు పెద్ద వాళ్లతో కలిసి అండర్19 ప్రపంచకప్ ఆడుతూ.. ఆ పెద్ద వయస్కులు కూడా అందుకోలేని స్థాయిలో అసామాన్య ప్రదర్శన చేశాడు. ఈ వయసులోనే ఇదేం ఆట అని వైభవ్ గురించి ఆశ్చర్యపోవడం ఏడాది కిందటే మొదలైంది. దేశవాళీల్లో సత్తా చాటి 13 ఏళ్ల వయసుకే ఐపీఎల్ వేలంలో కోటీశ్వరుడిగా మారి అందరూ ముక్కున వేలేసుకునేలా చేశాడు. వేలంలో అయితే అమ్ముడయ్యాడు కానీ.. మ్యాచ్ ఆడగలడా అని సందేహిస్తే, ఆ అవకాశమూ దక్కించుకున్నాడు. ఛాన్స్ అయితే వచ్చింది కానీ.. విపరీతమైన పోటీ ఉండే ఐపీఎల్‌లో ఇంత చిన్న కుర్రాడు నిలవగలడా అనుకుంటే రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్‌గా మహా మహా బౌలర్లను ఊచకోత కోస్తూ కేవలం 35 బంతుల్లో సెంచరీ కొట్టేశాడు. ఇలా ఎక్కడ ఆడితే అక్కడ ఈ చిన్నోడు వీరవిహారం చేయడం.. ఈ వయసులో ఇలా ఆడడం ఎలా సాధ్యం అని చూసేవాళ్లు అవాక్కవడం.. ఇదే వరస! ఏడాది తిరిగేసరికి అందరూ అతడి ఆటకు అలవాటైపోయారు. తన వయసు సంగతి మరిచిపోయారు. అతణ్ని ఒక స్టార్‌లా చూస్తున్నారు. అండర్19 ప్రపంచకప్ మొదలవుతుంటే అందరి దృష్టీ ఈ కుర్రాడి మీదే నిలిచింది. గ్రూప్ దశలో 5 మ్యాచ్‌ల్లో 196 పరుగులంటే మెరుగైన ప్రదర్శనే. కానీ ఇప్పటికే వైభవ్ తనపై బాగా అంచనాలు పెంచేసిన దృష్ట్యా ఈ ఆట అభిమానులకు ఆనలేదు. సెమీఫైనల్లో 68 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్ ఆడినా అది కూడా సరిపోలేదు. ఎట్టకేలకు ఫైనల్లో 175 పరుగుల ఇన్నింగ్స్‌తో తనపై అంచనాలను అందుకున్నాడు. 175 పరుగులంటే మారథాన్ ఇన్నింగ్స్ అనేవాళ్లు ఒకప్పుడు. అన్ని పరుగులు చేయాలంటే ఇన్నింగ్స్ ఆరంభం నుంచి చివరి వరకు నిలవాలి. 1983 ప్రపంచకప్‌లో కపిల్ ఇలాగే నిలిచి 175 పరుగులు చేశాడు. కానీ ఇప్పుడు వైభవ్ వన్డే మ్యాచ్‌లో సగం ఓవర్లకే అంత స్కోరు చేయడం అసామాన్యమైన విషయం. బంతి పడిందా దాని గమ్యం బౌండరీనే అన్నట్లు అతడు కొట్టిన షాట్లను చూసి అబ్బురపడకుండా ఉండలేం! కొన్ని షాట్లను వర్ణించడానికి ఉపమానాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా ఒంటిని విల్లులా వంచుతూ మిడ్‌వికెట్‌లోకి కొట్టిన సిక్సర్‌ను ఏమని వర్ణించాలి? తన శక్తికి.. చక్కటి ఫుట్‌వర్క్, టైమింగ్ కూడా తోడవడం వల్లే అతను ఇలా వీరవిహారం చేయగలుగుతున్నాడు. టీనేజీలో ఒకట్రెండు ఇన్నింగ్స్‌లతో సత్తా చాటిన క్రికెటర్లలో చాలామంది తర్వాత కనుమరుగైపోయిన వారే. బ్యాటర్ల బలహీనతలను కనిపెట్టి బౌలర్లు కళ్లెం వేస్తుంటారు. కానీ ఇప్పటిదాకా వైభవ్ వారి ఉచ్చులో పడలేదు. తన నిలకడ చూస్తుంటే అతను చరిత్ర సృష్టించేవాడే కానీ.. చరిత్రలో కలిసిపోయేవాడు కాదని అర్థమవుతోంది. తాజా ప్రదర్శనతో అతను సీనియర్ జట్టులో ఆడడానికి అర్హుడే అని స్పష్టమవుతోంది. సచిన్ కంటే చిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్లోకి ప్రవేశించి ప్రకంపనలు రేపేలాగే కనిపిస్తున్నాడు. ఇంకెంతో కాలం అతణ్ని భారత జట్టుకు దూరంగా ఉంచడం కష్టమే.

-15...ఫైనల్లో సూర్యవంశీ బాదిన సిక్సర్లు. యూత్ వన్డేల్లో తన పేరిట ఉన్న అత్యధిక సిక్సర్ల రికార్డు (14)ను తిరగరాశాడు.

-150...ఫైనల్లో ఫోర్లు (15), సిక్స్‌లు (15) రూపంలో సూర్యవంశీ సాధించిన పరుగులు. హసిత (శ్రీలంక, 124; 28×4, 2×6) రికార్డును బద్దలుకొట్టాడు.

